



ఆర్వోబీలకు.. ప్రత్యేక హోదా

- భూసేకరణ అనుమతులకు మార్గం సుగమం
- కేంద్ర ప్రభుత్వం గెజిట్.. కలెక్టర్‌కు బాధ్యతలు
- నిర్మాణాలకు కలిసొచ్చిన 5 నెలల సమయం

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు ఇటీవల మంజూరైన రైల్వే ఓవర్ బ్రిడ్జీలకు 'ప్రత్యేక రైల్వే ప్రాజెక్టు' హోదా లభించింది. ఆ మేరకు కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రైల్వే ప్రాజెక్టుల్లో భాగంగా గుంటూరు నగరానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్డు, పెద పలకలూరు-పేరేచర్ల ఆర్వోబీలను ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా గుర్తిస్తున్నట్లు ఆ నోటిఫికేషన్లో కేంద్రం ప్రకటించింది. దీంతో రెండు ఆర్వోబీలకు భూసేకరణ అనుమతుల కోసం వెచ్చించే 5 నెలల సమయం కలిసిరానుంది. గుంటూరు- కృష్ణా కెనాల్ లెవల్ మార్గంలో క్రాసింగ్ నెంబర్- 3 పరిధిలో గుంటూరు- నంబూరు స్టేషన్ల మధ్య, అంటే ఇన్నర్ రింగురోడ్డులో నాలుగు లైన్ల ఆర్వోబీ నిర్మాణాన్ని, లెవల్ క్రాసింగ్ నెంబర్- 6 కింద గుంటూరు - నడికుడి మార్గంలో నల్లపాడు-బండారుపల్లి స్టేషన్ల రెండు లైన్ల ఆర్వోబీ నిర్మాణాన్ని అధికారికంగా ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా గుర్తించినట్లుగా కేంద్రం స్పష్టం చేసింది. రెండు ప్రాజెక్టులకు భూసేకరణ బాధ్యతను జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు.



రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో పెమ్మసాని

హోదాతో ఇదీ ప్రయోజనం..

సాధారణంగా ఆర్వోబీలకు సంబంధించి భూసేకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకి కేంద్రం అప్పగిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖలకు నివేదికలను పంపి, అనుమతులు పొంది కలెక్టర్ ద్వారా రిపోర్టును కేంద్ర ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుంది. ఆ తర్వాత కేంద్రం నుంచి అనుమతులు పొందాలి. ఈ ప్రక్రియకు సుమారు 5- 6 నెలల సమయం పడుతుంది. ఈ పరిస్థితిని గమనించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి భూసేకరణ ప్రక్రియ అనుమతుల్లో జరిగే జాప్యాన్ని నివారించేలా సహకరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి రెండు ఆర్వోబీలను ప్రత్యేక రైల్వే ప్రాజెక్టులుగా గుర్తింపు ఇస్తూ గెజిట్ నోటిఫికేషన్ను విడుదల చేశారు. దీంతో భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన ప్రారంభించేందుకు వీలు కలిగింది. ఫలితంగా నిర్మాణ సమయం కలిసి రానున్నది.

ఓఆర్ఆర్ ఆమోదం.. బైపాస్ రద్దు


- ఆచరణకు నోచుకోని కేంద్ర మంత్రి గడ్కరీ హామీ
- విజయవాడ తూర్పు బైపాస్‌కి రూ.2,176 కోట్లు కేటాయించినా రద్దు
- ట్రాఫిక్ కష్టాలు ఇప్పట్లో తొలగే అవకాశం లేదని గుంటూరు, కృష్ణా జిల్లా వాసుల ఆందోళన
- తూర్పు బైపాస్ రద్దుతో ఎయిర్‌పోర్టు కనెక్టవిటీపై ప్రభావం
- ఎన్‌హెచ్- 16తో ట్రాఫిక్ కష్టాలు.. వెస్ట్ బైపాస్‌తో 10-15 కి.మీ. అదనపు ప్రయాణం

ట్రాఫిక్ కష్టాలు తీరేలా.. ఎయిర్‌పోర్టు కు ఉమ్మడి గుంటూరు జిల్లావాసులు సులభంగా చేరేలా.. రాజధాని అమ రావతి అభివృద్ధిలో కీలకమైన ప్రాజెక్టుగా ఉన్న విజయవాడ తూర్పు బైపాస్‌ను కేంద్రం రద్దు చేసింది. రాజధాని అమరావతికి చుట్టూ ఔటర్ రింగు రోడ్డు మం జూరు చేసిన కేంద్ర ప్రభుత్వం ఇక తూర్పు బైపాస్ అవసరం లేదని తేల్చేసింది. గతంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తూర్పు బైపాస్‌కు ఆమోదం తెలిపి ప్రత్యేకంగా నిధులను కూడా కేటాయించారు. బైపాస్ నిర్మాణానికి అలైన్‌మెంట్ కూడా ఖరారు చేశారు. ఇక భూ సేకరణ పనులు ప్రారంభమ వు తాయనుకుంటున్న సమయంలో తాజాగా మంజూరైన ఓఆర్ఆర్ పేరుతో తూర్పు బైపాస్‌ను రద్దు చేయడం ఉమ్మడి గుంటూ రు, కృష్ణా జిల్లాల ప్రజలను కలవరపెడు తోంది. ఓఆర్ ఆర్, తూర్పు బైపాస్ పక్కపక్క గా వస్తాయి.. ఇక బైపాస్ అవసరం లేదని కేంద్రం చెప్పడం భావ్యం కాదని.. అలైన్ మెంట్ మారిస్తే సరి పోయే దానికి రద్దు చేయడం సరికాదని ఇటు గుంటూరు, అటు విజయవాడ వాసులు అభిప్రాయ పడుతున్నారు.

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి, గుంటూరు, విజ యవాడను అనుసంధానించే అత్యంత కీలకమైన రహదారుల నిర్మాణంపై తాజా పరిణామాలు ప్రజల్లో నిరాశను కల్పిస్తున్నాయి. రాజధాని అమరావతికి చుట్టూ ఔటర్ రింగు రోడ్డు మంజూరైన సంతోషం మిగలకుండా, అప్పటికే మంజూరైన విజయవాడ తూర్పు బైపాస్‌ను రద్దు చేయడం రెండు జిల్లాల ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. రాజధానికి అనుబంధంగా ఉన్న ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల రవాణా అవసరాల్లో అత్యంత కీలకమైన ఈ బైపాస్ రద్దుతో ట్రాఫిక్ కష్టాలు ఇప్పట్లో తొలగే అవకాశం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు, విజయ వాడ నగరాల మీదగా వెళ్లే అత్యంత కీలకమైన చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి ఎన్‌హెచ్- 16 ట్రాఫిక్ పద్మవ్యూహంగా మారింది. ఈ రహదారి విజయవాడ బెంజిసర్కిల్, మహానాడు జంక్షన్, రామవరప్పాడురింగు, రామవరప్పాడు గుండా వెళుతుంది. ఈ నాలుగు చోట్ల గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ నేపథ్యంలో విజయవాడకు తూర్పు, పశ్చిమలుగా రెండు బైపాస్‌లు నిర్మించాలని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో పశ్చిమ బైపాస్ నిర్మాణం ఒక కొలిక్కివచ్చింది. ఇక తూర్పు బైపాస్ పనులు జరగాల్సి ఉం డగా కేంద్ర ప్రభుత్వం దాని అవసరం లేదని తేల్చింది.

కీలకమైన రహదారి..

రాజధాని అమరావతి అభివృద్ధిలో రహదారుల కనెక్టివిటీ, పోర్టుల అనుసంధానం అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో విజయవాడ తూర్పు బైపాస్ ఎంతో కీలకమైనది. గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజలు, ప్రధానంగా తీర ప్రాంత ప్రజలను ఎయిర్‌పోర్టుకు అనుసంధానించడంలో ఇదే అత్యంత కీలకమైన రోడ్డుగా భావించారు. ఓఆర్ఆర్ అందుబాటులోకి వచ్చే వరకూ బందరు సీపోర్టు నుంచి ఎయిర్ పోర్టును అనుసంధానం చేయడంలో కూడా ఈ రహదారి కీలకమైనది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలతో పాటు, తూర్పు రాయల సీమ ప్రాంతాల్లోని ప్రజలకు ట్రాఫిక్ లేని రవాణాను అందుబాటులోకి తేవడంలో ఈ బైపాస్ కీలకమైనది. ఈ పరిస్థితుల్లో కిందటేడాది సెప్టెంబరు నెలాఖరున కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదముద్ర వేశారు. ఎన్టీఆర్ జిల్లా పొట్టిపాడు టోల్ ప్లాజా నుంచి గుంటూరు జిల్లా చినకాకాని వరకు రూ.50 కి.మీ మేర ఈ రహ దారిని నిర్మించేందుకు ఆమోదం తెలిపి రూ.2,176 కోట్లు కేటాయించారు.



ఈస్ట్ బైపాస్ నమూనా ప్రతిపాదనలు

ట్రాఫిక్ కష్టాలు..

రాజధాని నిర్మాణ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల రాక, కార్యకలాపాలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో విజయవాడలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. సాధారణ రవా ణాతోపాటు విజయవాడ ఆటోనగర్ రవాణా, బందరు పోర్టు రవాణా కు నాలుగు చోట్ల అవకాశం కల్పించారు. దీంతో మహానాడు జంక్షన్, రింగురోడ్డు జంక్షన్, రామవరప్పాడు గ్రామాల్లో ట్రాఫిక్ గంటల కొద్దీ ఆగి పోతోంది. దీంతో ఎయిర్‌పోర్టు చెకిన్ వద్ద ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ వెస్ట్ బైపాస్ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లాలంటే పొట్టి పాడు టోల్‌గేటు వరకు వెళ్లి, అక్కడి నుంచి తిరిగి వెనక్కి రావాల్సి ఉం టుంది. అలా చేస్తే కనీసం 10 నుంచి 15 కి.మీ మేర అదనంగా ప్రయా ణించాల్సి ఉంటుంది. అదే ఈస్ట్ బైపాస్ అయితే నేరుగా ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ ఉంటుంది. ఈస్ట్ బైపాస్ రద్దు వల్ల రాజధాని అమరావతి సహా, గుంటూరు, తెనాలి, మంగళగిరి, రేపల్లె, దుగ్గిరాల, పొన్నూరు, చిలకలూరిపేట, మార్టూరు తదితర ప్రాంతాల ప్రజలతోపాటు కృష్ణా జిల్లాలోని బందరు, అవనిగడ్డ, పామర్రు, గు డి వాడ ప్రజలు ఎయిర్‌పోర్టుకు వెళ్లాలంటే ఇబ్బందులు పడక తప్పదు.

అలైన్‌మెంటు మార్చితే పోయేదానికి..

ఓఆర్ఆర్, ఈస్ట్ బైపాస్‌ల నిర్మాణం ఒకదానికి ఒకటి దగ్గరగా ఉంటున్నాయన్న కారణం చూపి కేంద్రం ఈస్ట్ బైపాస్‌ను రద్దు చేసింది. వాస్తవానికి ఈస్ట్ బైపాస్ నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ 3 అలైన్‌మెంట్లను సూచించింది. ఆప్షన్ 1 కింద విజయవాడకు సమీపంగా 41.230 కి.మీ, ఆప్షన్ 2 కింద మరికొంచెం దూరంలో 44.185 కి.మీ, ఆప్షన్- 3 కింద విజయవాడకు దూరంగా 45.595 కి.మీ పొడవున బైపాస్ ని ర్మించుకునే అవకాశం ఉంది. అయితే ఇందులో మూడో ఆప్షన్‌ను ఎన్ హెచ్ఏఐ ఓకే చేసింది. ఆ రోడ్డు ఇప్పుడు ఓ ఆర్ఆర్‌కు సమీపంలో వస్తోందని, అందుకే ఆ రోడ్డు అవసరం ఉండదని చెప్పి కేంద్రం బైపాస్‌ను రద్దు చేసింది. రెండు రోడ్లు పక్క పక్కనే వచ్చే అవకాశం ఉన్నప్పుడు ఆప్షన్ మార్చి తొలి రెండు ఆప్షన్లలో ఏదో ఒక ఆప్షన్ ను ఎంచుకుంటే బాగుండేదని ప్రజలు భావిస్తున్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించాలని కోరుకుంటున్నారు.

కొనసాగుతున్న పది పరీక్షలు

గుంటూరు(విద్య), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. గురువారం జరిగిన పరీక్షకు 27,625 మంది హాజరుకావాల్సి ఉండగా 27,478 మంది హాజరయ్యారని డీఈవో రేణుక తెలిపారు. దూర విద్యపరీక్షకు 1039 మందికి 836 మంది హాజరయ్యారన్నారు. రాష్ట్ర పరిశీలకులు పార్వతి ఆరు కేంద్రాల్లో, డీఈవో రేణుక ఏడు కేంద్రాల్లో, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది 60 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.24 (గురువారం సాయంత్రం) | సహారి : 4.55 (శుక్రవారం ఉదయం)

మండల పరిషత్ అధ్యక్షుల ఎన్నిక 27న

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు స్థానాల్లో ఖాళీలు

గుంటూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ల్లో ఎన్నికల నగారా మో గింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఖాళీ గా ఉన్న మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కో- ఆప్షన్ సభ్యుల ను ఎన్నుకునేందుకు ఎన్నికల కమిషన్ బుధవారం అనుమతి ఇచ్చింది. తొలు త ఆయా పదవులు ఖాళీగా ఉన్న మండలాలకు కలెక్టర్ ప్రత్యేక అధికారులను నియమి స్తారు. నియమించబడిన ప్రత్యేక అధికారులు ఈ నెల 23 నాటికి మండల పరిషత్‌లోని సభ్యులకు నోటీసులు అందజేస్తారు. 27న నిర్వ హించే ప్రత్యేక సాధారణ సమావేశంలో ఎంపీపీ, ఉప ఎంపీపీ, కో-ఆప్షన్ సభ్యుల ను ఎన్నుకుంటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అచ్చంపేట, పిట్టలవానిపాలెం, దుగ్గిరాల మండల పరిషత్‌ల్లో అధ్యక్ష స్థానాలు ఖాళీగా ఉన్నాయి. నరసరావుపేట, గుంటూరు రూరల్, కారంపూడి మండలాల్లో ఉపాధ్యక్ష స్థానాలు ఖాళీగా ఉన్నాయి. భట్టిప్రోలు, తెనాలి, ముప్పాళ్ల మండల పరిషత్‌ల్లో కో-ఆప్షన్ సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఆయా స్థానాల్లో ఎన్నికల కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


వైసీపీకి మర్రి షాక్

- ఎమ్మెల్సీ పదవికి రాజీనామా
- రెండు రోజుల్లో పార్టీకి రాజశేఖర్ గుడ్‌బై
- అనుయాయులతో కలిసి త్వరలో టీడీపీలో చేరిక



గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆవిర్భా వం నుంచి పార్టీకి వెన్నుదన్నుగా ఉండటమే కాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలుత రథ సారథ్యం వహించిన మర్రి రాజశేఖర్ వైసీపీకి షాకిచ్చారు. ఎంతోకాలం నుంచి అందరూ ఊహించినట్లుగానే మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ వైసీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఆయన తొలుత వైసీపీ ద్వారా తాను పొందిన ఎమ్మెల్సీ పదవిని వదిలేసుకున్నారు. ఈ మేరకు రాజీ నామా పత్రాన్ని బుధవారం శాసనమండలి ఛైర్మన్‌కు అందజేశారు. చిలకలూరిపేటలో కాం గ్రెస్‌లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అనం తరం వైసీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరారు. అయితే విడదల రజిని రాజకీయ అరంగేట్రంతో నియోజకవర్గంలో మర్రి రాజశేఖర్ ప్రాధాన్యం తగ్గిపోయింది. 2019 ఎన్నికల్లో ఇన్‌చార్జిగా వ్యవ హరిస్తున్న రాజశేఖర్‌ను కాదని వైసీపీలో కొత్తగా చేరిన విడదల రజినికి సీటు ఇవ్వడంతో మర్రి అనుయాయులు తిరుగుబాటు చేశారు. ఆ సమయంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా చిలకలూరిపేట వెళ్ళిన వైఎస్ జగన్ రజినిని గెలిపిస్తే రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత కనీసం ఎమ్మెల్సీ పదవి కూడా వెంటనే ఇవ్వ కుండా రజినికి మంత్రి పదవిని కట్టబెట్టారు. ఈ క్రమంలో వరుస పరాభవాలతో రగిలిపోతున్న ఆయన కొద్దికాలంగా పార్టీకి దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో గుంటూరు పశ్చిమలో ఓడిపోయిన మాజీ మంత్రి విడదల రజినిని తిరిగి చిలకలూరిపేటకు ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఆయన ఉక్రోషంతో రగిలి పోయారు. ఆ సమయంలోనే ఆయన వైసీపీని వీడతారని కథనాలు వెలువడ్డాయి. అంతక ముసుపు జగన్ రాజశేఖర్‌ను పిలిపించుకుని చిలకలూరిపేట ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తానని హామీ ఇవ్వడమే కాకుండా వచ్చే ఎన్నికల్లో సతీమణికి సీటు ఇస్తానని ఆశ పెట్టారని సమాచారం. ఇది జరిగిన కొద్ది రోజులకే రజిని చక్రం తిప్పడం ఆ తర్వాత వారం రోజులు గడవక ముందే మర్రికి ఇచ్చిన హామీని జగన్‌తుంగలో తొక్కి చిలకలూరిపేట ఇన్‌చార్జి బాధ్యతలు రజినికి కట్టబెట్టటంతో మర్రి అవాక్కయ్యారు. ఇక ఆ రోజు నుంచే ఆయన టీడీపీలో చేరాలని నిర్ణయించు కున్నారు. 2023లో ఆయనకు ఎమ్మెల్సీ ఇవ్వగా 2029 వరకు ఆ పదవిలో కొనసాగే అవకాశం ఉన్నా కూడా పదవికి రాజీనామా చేయడం విశేషం. గత ఎన్నికల సమయంలో వైసీపీని వీడి టీడీపీలో చేరి తిరిగి ఎంపీగా గెలుపొందిన లావు శ్రీకృష్ణదేవరాయులతో రాజశేఖర్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. కాగా త్వరలో మంచి ముహూర్తం చూసుకుని తన అనుయాయులతో వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరేందుకు ఆయన సన్నద్ధమ వుతున్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవలోని లోపాలపై దృష్టి సారించండి : ప్రత్తిపాటి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం కోరేవారి సంఖ్య పెరగడంపై ప్రభుత్వం ఆలోచించాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం సూచించారు. అసెంబ్లీలో రాష్ట్ర వైద్యరంగంపై జరిగిన చర్చలో పుల్లారావు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవలోని విధాన లోపాలు, క్షేత్రస్థాయిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. గుండె, కిడ్నీ ఇతర ప్రధాన అవయవాల శస్త్రచికిత్సలు, క్యాన్సర్ చికిత్సలకు కొన్ని ఆసుపత్రులు అదనంగా డబ్బు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. చిలకలూరిపేటలో వందపడకల ఆసుపత్రిని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాని కోరారు.

పశుసంవర్ధక శాఖలో భారీ కుంభకోణం

వెటర్నరీ మొబైల్ క్లినిక్‌ల కొనుగోళ్లలో అవినీతి

అసెంబ్లీలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల ధ్వజం


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర

పొన్నూరుటౌన్, గుంటూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆర్కేవీవై స్కీమ్‌లో భాగంగా కొనుగోలు చేసిన వెటర్నరీ మొబైల్ కొనుగోళ్ల క్లినిక్స్‌లో జరిగిన భారీ అవినీతిపై విచారణ జరపాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ బుధవారం శాసనసభ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో మొబైల్ అంబులెన్స్‌ల కొనుగోళ్లలో ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారుల కుమ్మక్కుతోనే నాటి ప్రభుత్వ పెద్దలు భారీ దోపిడీకి తెర లేపారని ఆరోపించారు. వాహన కొనుగోళ్ల ధరలను పక్క రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో భారీ వ్యత్యాసం ఉందన్నారు. ఫేజ్-1లో 175 వాహనాలు రూ. 145 కోట్లతో, ఫేజ్-2లో 165 వాహనాలు రూ. 110 కోట్లతో కొనుగోలు చేశారని చెప్పారు. మొదటి దశలో వాహనం, ఆపరేటింగ్ సిస్టం కలిపి ఒక్కో క్లినిక్‌ను రూ. 82 లక్షలకు కొనుగోలు చేస్తే రెండవ దశలో రూ. 68 లక్షలు చెల్లించారన్నారు. ఈ రెండు దశల మధ్య ఒక్కో క్లినిక్ ఏర్పాటుకు రూ. 14లక్షల వ్యత్యాసం ఉందన్నారు.

సీఆర్‌డీఏకి భారీగా ఇసుక డిమాండ్

● కోటి 98 లక్షల 35 వేల 670 క్యూబిక్ మీటర్లకు ఇండెంట్ ● ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా, హెచ్ అండ్ జీ, ఏడీసీఎల్ నుంచి విజ్ఞప్తులు

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నగరంలో ఇప్పటికే కొన్ని పెండింగ్ పనుల నిర్మాణం ప్రారంభం కావడం... మరికొద్ది రోజుల్లో రూ.వేల కోట్ల వర్కులు కూడా మొదలు కానుండటంతో సీఆర్‌డీఏకి భారీగా ఇసుక అవసరం ఏర్పడింది. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన, ఇళ్లు, భవనాల నిర్మాణాలకు ఇసుక అవసరమని సీఆర్‌డీఏకి ఇటీవలే ఇండెంట్లు అందాయి. దాంతో ఆ సంస్థ గుంటూరు జిల్లా గనులు, భూగర్భ శాఖకు ఇసుక డిమాండ్ వివరాలను తెలియజేయగా ఆ మేరకు సరఫరా చేసేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందిస్తున్నది. కేవలం మూడు నెలల వ్యవధిలో 51 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం ఉండటంతో కృష్ణానదిలో పలుచోట్ల పూడిక తొలగింపు, తవ్వకాల ద్వారా సరఫరా చేసేందుకు ప్రణాళికని సిద్ధం చేస్తున్నది. ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు నుంచి ఇటీవలే గుంటూరు జిల్లా మైనింగ్ డిపార్టుమెంట్‌కు కేటగిరీల వారీగా ఇసుక డిమాండ్ విజ్ఞప్తి అందింది. ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రాకు కోటి 18 లక్షల 69 వేల 500 క్యూబిక్ మీటర్లు, హెచ్ అండ్ బీకి 11 లక్షల 77 వేల 815, ఏడీసీఎల్‌కి 67 లక్షల 88 వేల 355 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమని నివేదించారు. ఇందులో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ప్రతీ 15 రోజులకు ఒకసారి ఇసుక సరఫరా చేయాలని కోరారు. మొదటి నెలలో 8.65 లక్షలు క్యూబిక్ మీటర్ల మేరకు రెండు సార్లు, రెండో నెలలో 8.49 లక్షల మేరకు రెండు సార్లు, మూడో నెలలో కూడా 8.49 లక్షల మేరకు రెండుసార్లు ఇసుక సరఫరా చేయాలన్నారు. ఇందుకు కారణం కేంద్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నుంచి అమరావతి రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూరుస్తున్నది. అలానే హడ్కో నుంచి రూ.11 వేల కోట్ల రుణం లభించింది. అలానే జర్మనీకి చెందిన మరో బ్యాంకు నుంచి రూ.5 వేల కోట్ల రుణం మంజూరు కాబోతున్నది. రహదారుల నిర్మాణం, ఎల్‌పీఎస్ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన, రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ వంటి అనేక పనులను వివిధ సంస్థలు చేపట్టబోతున్నాయి. దీంతో ఇసుకకి భారీగా డిమాండ్ ఏర్పడింది. కాగా గుంటూరు జిల్లాలో ప్రస్తుతం గుండిమెడ-2 ఓపెన్ రీచ్‌లో 51 వేలు, బొమ్మువానిపాలెం-1లో 72 వేలు, బొమ్మువానిపాలెం-16 ఓపెన్ రీచ్‌లో 2.50 లక్షలు, బొమ్మువానిపాలెం-17 ఓపెన్ రీచ్‌లో లక్ష, రాయపూడిలో పూడిక తొలగింపు చేపట్టాల్సిన ప్రదేశంలో 1.19 లక్షలు, నేవిగేషన్ ఛానల్‌లో డ్రెడ్జింగ్ చేస్తే 5.16 లక్షలు, బోరుపాలెంలో 2.30 లక్షలు, బొమ్మువానిపాలెం-14లో 47 వేవల, బొమ్మువానిపాలెం-15లో 55 వేల క్యూబిక్ మీటర్లు మొత్తం కలిపి 14.49 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. 54 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఇసుక డిమాండ్ ఉండటంతో దాదాపుగా 45 లక్షల టన్నుల ఇసుక లోటు ఉన్నది. ఈ నేపథ్యంలో జిల్లాలో మరికొన్ని ఇసుక మేటలు ఉన్న ప్రదేశాలను గుర్తిస్తామని, అయినప్పటికీ సీఆర్‌డీఏ అవసరం మేరకు సరఫరా చేయలేని పరిస్థితి ఉంటుందని గుంటూరు జిల్లా అధికారులు తెలిపారు. ఈ కారణంగా కృష్ణా, పల్నాడు, బాపట్ల, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు కూడా ఇండెంట్ పెట్టాల్సిందిగా సీఆర్‌డీఏకి సూచిస్తున్నారు.

మద్యం మత్తు బానిసలకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వండి

ఎక్సైజ్ శాఖ రాష్ట్ర కమిషనర్ నిశాంత్ కుమార్


డీ ఎడిక్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న నిశాంత్ కుమార్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తుకు బానిసైన వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో కలిసి బుధవారం ఆయన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ ఎడిక్షన్ సెంటర్‌ను, గుంటూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలోని లేబరేటరీని పరిశీలించారు. ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ మాట్లాడుతూ మత్తుమందుకు బానిస అయిన వారు మత్తుకు దూరంగా ఉండేలా చేయాలని, అందుకు కౌన్సెలింగ్ బాగా ఉపయోగపడుతుందన్నారు. క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో కౌన్సెలింగ్ ఇవ్వటంతో వారిలో క్రమక్రమంగా మార్పు కనిపిస్తుందన్నారు. ఈ విధంగా మార్పు రావడం వల్ల వారు మత్తుకు దూరంగా ఉంటారని అన్నారు. మద్యం మత్తులో పడితే వారి జీవితాలు ఇబ్బందులకు గురవుతాయని, మానసిక స్థితి సక్రమంగా ఉండదని, దీనివల్ల కుటుంబం చిన్నా భిన్నమవుతుందన్నారు. గుంటూరు ఎక్సైజ్ కార్యాలయంలోని లేబరేటరీని పరిశీలించి కొత్తగా ఏర్పాటు చేసిన మిషనరీ ఎలా పని చేస్తుందని అడిగి తెలుసుకున్నారు. కల్తీ మద్యంపై నిఘా ఉంచాలని, శాంపిల్స్‌లో ఏ మాత్రం అనుమానం ఉన్నా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, గుంటూరు ఎక్సైజ్ శాఖ అధికారి అరుణ కుమారి, ఏఈ ఎస్ మారయ్య బాబు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 518.90 అడుగులు ఉంది. ఇది 147.27 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7852 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,685 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మేడికొండూరు వ్యవసాయ అధికారిపై వేటు

● యలవర్తిపాడు పంట నష్ట పరిహారం అక్రమాలపై చర్యలు
● పల్నాడుకు డిప్యుటేషన్‌పై పంపుతూ కమిషనర్ ఉత్తర్వులు

గుంటూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పంట నష్ట పరిహారం చెల్లింపుల్లో జరిగిన అక్రమాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మేడికొండూరు మండల వ్యవసాయ అధికారి ఎం నాగరాజుపై తాత్కాలిక బదిలీ వేటు వేశారు. మేడికొండూరు మండలం యలవర్తిపాడులో గత ఏడాది జరిగిన వరదల్లో పంట నష్టం భారీగా జరిగింది. పంట నష్ట పరిహారం కాజేసేందుకు వ్యవసాయ శాఖ అసిస్టెంట్, రెవెన్యూ సిబ్బంది ముందుగానే ప్రణాళికలు రచించారు. లేని రైతులను ఈ-పంటలో నమోదు చేసి నష్ట పరిహారం దారి మళ్లించారు. ఈ వ్యవహారం బయటకు రావడంతో అప్పట్లోనే అగ్రికల్చర్ అసిస్టెంట్, రెవెన్యూ సిబ్బందిపై చర్యలు చేపట్టారు. మండల ఏవో ఈ విషయంలో అప్రమత్తంగా లేరన్న ఆరోపణలు రావటంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా వ్యవసాయ అధికారి కమిషనర్‌కు సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలో ఏవో నాగరాజును పల్నాడు జిల్లా రైతు శిక్షణా కేంద్రానికి డిప్యూటేషన్‌పై పంపుతూ బుధవారం వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఫిరంగిపురం ఏవో వాసంతికి మేడికొండూరు వ్యవసాయ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

'సాయి సాధన' కేసు గుంటూరుకి బదిలీ

నరసరావుపేట లీగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చిట్‌ఫండ్ దారులను, డిపాజిట్ దారులను భారీస్థాయిలో మోసగించినట్లు వేలూరు సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసు గుంటూరులోని ఆరవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టుకు బదిలీ అయింది. ఈ కేసును గుంటూరు ఆరవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టుకు బదిలీ చేయవలసిందిగా పోలీస్‌లు పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు స్థానిక 13వ అదనపు జిల్లా న్యాయస్థానంలో పాలడుగు పుల్లారావు కుటుంబ సభ్యులు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా గుంటూరు జిల్లాప్రధాన న్యాయస్థానానికి బదిలీ అయింది. ఈ మేరకు బుధవారం నరసరావుపేట 13వ అదనపు జిల్లా న్యాయస్థానం ఏపీపీ మల్లారెడ్డి కోర్టులో రిప్రజెంటేషన్ చేశారు. ఈ కేసులో సంస్థతో పాటు మరో ఆరుగురిని పోలీసులు నిందితులుగా పేర్కొన్నారు. పాలడుగు పుల్లారావు, ఆయన భార్య వాణిశ్రీ ,కుమారుడు పవన్ కుమార్, కుమార్తె శ్రీహర్షవర్ధిని, అల్లుడు ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ నూకవరపు రాజా రమేష్, నకరికల్లు మండలం కండ్లకుంట గ్రామానికి చెందిన గాలికోటయ్యలు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు.

మిర్చియార్డులో భోక్తలపై క్రిమినల్ చర్యలు

● అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటన

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు)లో జరిగిన అవినీతి, అక్రమాలపై బుధవారం శాసనసభలో చర్చ జరిగింది. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్‌అహ్మద్ వేసిన ప్రశ్నపై మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం ఇచ్చారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటన చేశారు. ఈ ప్రశ్నకు అనుబంధంగా నసీర్‌తో పాటు ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్(పొన్నూరు), బూర్ల రామాంజనేయులు(ప్రత్తిపాడు) గళం విప్పారు. దాదాపుగా 20 నిమిషాలకు పైగా ఈ ఒక్క ప్రశ్న పైనే చర్చ జరగడం విశేషం. వైసీపీ ప్రభుత్వంలో మిర్చియార్డులో అనేక అక్రమాలు జరిగాయని, రూ.347.71 కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని విజిలెన్స్ నివేదిక ఇచ్చినట్లు మంత్రి చెప్పారు. ఒకరిద్దరు మాజీ చైర్మన్లు, 19 మంది అధికారులపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేసినట్లు తెలిపారు. యార్డులో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వచ్చిన పరిహారంలోనూ గత కాంగ్రెస్‌లో పాలకులు(ప్రస్తుతం వైసీపీ) దోచుకున్నారని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ వివరించారు. ఈనాం విధానాన్ని పక్కనపెట్టి రూ.160 కోట్లు రావాల్సిన మార్కెట్ సెస్‌ను రూ.80 కోట్లకు చూపించారని తెలిపారు. వైసీపీ వాళ్ల బంధువులు, మిత్రులకు 287 లైసెన్సులను అక్రమంగా కట్టబెట్టారని, ఇందులోనూ దోపిడీ జరిగిందని తెలిపారు. మిర్చియార్డుని సమూలంగా ప్రక్షాళన చేయాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కోరారు. టీడీపీ ఆఫీసుపై దాడికి మిర్చియార్డులో వైసీపీ నాయకులు వ్యూహరచన చేశారని ఆరోపించారు. మిర్చియార్డుని విభజన అయినా చేయాలని, లేకుంటే ప్రత్తిపాడుకు తరలించాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు.

గేట్‌లో భాష్యం పూర్వ విద్యార్థికి 25వ ర్యాంక్


గంటా హేమంత్

గుంటూరు (విద్య) మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) 2025 బుధవారం విడు దల చేసిన పరీక్షా ఫలితాలలో భాష్యం పూర్వ విద్యార్థి ఘంటా హేమంత్ జాతీయస్థాయిలో 25వ ర్యాంకును సాధించినట్లు భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో ఐఐటీ రూర్కీ ద్వారా గేట్ పరీక్ష నిర్వహించారు. డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (డీఏ) విభాగంలో భాష్యం పూర్వ విద్యార్థి జాతీయస్థాయిలో ఆలిండియా 25వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. హేమంత్ స్కూల్ స్థాయి నుంచి భాష్యం విద్యా సంస్థల్లో చదువుకుని భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ ద్వారా 2021లో ఐఐటీ మద్రాస్‌లో సీటు సాధించినట్లు గుర్తు చేశారు. హేమంత్‌ను, వారి తల్లిదండ్రులను చైర్మన్ రామకృష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్‌లు అభినందించారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

● ఐజీ, ఏపీ ఈగల్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఆకే రవికృష్ణ

తాడికొండ(లాం), మార్చి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, లేనిపక్షంలో జీవితం సర్వ నాశనమవుతుందని ఐజీ, ఏపీ ఈగల్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఆకే రవికృష్ణ తెలిపారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐజీ ఆకే రవికృష్ణ

చలపతి విద్యాసంస్థలు ప్రారంభమై 30 సంవత్సరాలు అవ్వటంతో నాలుగురోజుల పాటు మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆకే రవికృష్ణ, చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యార్థి దశ చాలా ముఖ్యమైందన్నారు. నేటి యువత సినిమాల్లో చూపించే డ్రగ్స్ మాదక ద్రవ్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు త్వరగా బానిసలు అవుతున్నారన్నారు. మద్యం, గంజాయి, కొకైన్, బ్రౌన్ షుగర్ ఇతర పదార్థాల కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఈగల్ ఆర్గనైజేషన్ ఎస్పీ కే నగేష్‌బాబు మాట్లాడుతూ నేటి యువత టెక్నాలజీని చెడుమార్గంలో ఉపయోగిస్తున్నారన్నారు. వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ చలపతి విద్యాసంస్థలు ఒక స్కూల్‌తో ప్రారంభమై ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, జూనియర్ కళాశాలలుగా ఎదిగి ప్రగతి పథంలో ముందుకు దూసుకువెళ్తున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వై సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎం చంద్రశేఖర్, అకాడమిక్ డీన్ జే లక్ష్మీనారాయణ, ట్రైనింగ్ డీన్ చందు రవిశంకర్, డైరెక్టర్ డీ వినయ్‌కుమార్, నాగగోపిరాజు, డీ తిరుపతినాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తురకా కిశోర్‌ను నెల్లూరుకు తరలించిన పోలీసులు

మాచర్లటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పిన్నెల్లి సోదరుల ప్రధాన అనుచరుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్, అతని సోదరుడు శ్రీకాంత్‌లను నెల్లూరు జైలుకు తరలించారు. క్రైం నంబరు 69/2022లో ఈనెల 6వ తేదీన మండలంలోని విజయపురిసౌత్ పోలీసులు మంజుల చిన అంజిపై జరిగిన దాడి, కారు ధ్వంసం కేసులో పీటీ వారెంట్ ద్వారా కోర్టుకు హాజరుపరిచారు. ఆ కేసులో రిమాండ్‌పై నెల్లూరులో ఉండగా విచారణ నిమిత్తం కోర్టు ద్వారా రెండు రోజుల అనుమతి పొందిన పోలీసులు మంగళ, బుధ వారాలు గురజాల పోలీసు స్టేషన్లో విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ షఫి విచారించి మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ న్యాయవాది (పీపీ) పీఆర్ రవీంద్రబాబు వాదనలు వినిపించగా, కిశోర్ తరుపున వరప్రసాద్ వాదనలు వినిపించారు. వాదనల అనంతరం న్యాయమూర్తి పీ ప్రశాంత్ రిమాండ్ కొనసాగింపునకు అనుమతి ఇచ్చా రు. దీంతో విజయపురిసౌత్ పోలీసులు నెల్లూరు జైలుకు తరలించారు. గురువారంతో ఈ కేసులో రిమాండ్ 14 రోజుల గడువు పూర్తి కానుంది.

క్రేన్ గ్రూపు సంస్థల్లో రెండో రోజు కొనసాగిన ఐటీ సోదాలు

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను శాఖ అధికారులు గుంటూరు నగరంలోని క్రేన్ గ్రూపు సంస్థల్లో సోదాలను రెండో రోజు కూడా కొనసాగించాయి. మంగళవారం ప్రారంభమైన సోదాలు బుధవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా విలువైన బంగారు, వెండి, వజ్రాభరణాలు, కొంత మొత్తంలో నగదు, కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ సోదా లలో ఏమేమి సీజ్ చేసిందనే వివరాలను ఇంకా ఐటీ శాఖ ప్రకటన చేయలేదు.

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మహిళను హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, 10 వేల రూపాయల జరిమానా విధిస్తూ బాపట్ల ఆరవ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి కె.శ్యాంబాబు బుధవారం తీర్పునిచ్చారు. ఎస్పీ తుషార్ డూడీ తెలిపిన వివరాలు ప్రకారం.. చంద్రగూడెం గ్రామానికి చెందిన బొల్లిపోగు 2012లో గుంటూరులోని ఓ కళాశాలలో కేర్‌టేకర్‌గా చేరింది. అక్కడే ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే గారపాటి రాజశేఖర్ మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. 2013 మార్చి 22న బాపట్ల మండలంలోని అడవిగ్రామపంచాయతీ మత్స్యశాఖవారి శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్ సమీపంలోని ఏకాంత ప్రదేశానికి తీసుకొచ్చి లైంగిక కోరికను తీర్చుకున్న తర్వాత పదునైన ఆయుధంతో హత్య చేశాడు. దీనిపై గ్రామపంచాయతీ వీఆర్వో ఇచ్చిన రిపోర్ట్ మేరకు అప్పటి రూరల్ ఎస్ఐ వై.కోటేశ్వరరావు హత్య కేసుగా నమోదు చేశారు. సీఐ వై.రామారావు కేసు దర్యాప్తు చేసి నేరస్థుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. బాపట్ల ఆరవ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టులో కేసుకు విచారణకు రాగా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు డీఎస్పీ రామాంజనేయులు పర్యవేక్షణలో రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ ఈశ్వర్, సెషన్స్ కోర్టు హెడ్‌కానిస్టేబుల్ జి.శివయ్యలు, సాక్షులు సరైన రీతిలో సాక్ష్యం చెప్పటంతో నిందితుడు గారపాటి రాజశేఖర్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10 వేల జరిమాన విధిస్తూ తీర్పు వెలువడినట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు.

ఆగి ఉన్న మద్యం లారీని మరో లారీ ఢీ


బోల్తాపడిన మద్యం లోడు లారీ

యడ్లపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న మద్యం లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న సంఘటన పదహారో నంబరు జాతీయరహదారిపై యడ్లపాడు వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ 27 వై 2345 నంబరు గల లారీ సింగరాయకొండలోని స్టాక్ పాయింట్ నుంచి మద్యం లోడుతో సామర్లకోటకు మంగళవారం బయలుదేరింది. పిల్లికొండవద్దకు రాగానే డ్రైవర్ లారీని పక్కగా నిలిపి కేబిన్‌లో పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో అదే మార్గంలో వచ్చిన ఏపీ 39 యూఎన్ 2179 నంబరు గల లారీ ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. లారీ రెయిలింగ్‌ను దాటుకుని సర్వీసురోడ్డులోకి పల్టీకొట్టింది. కేబిన్‌లో పడుకున్న డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్‌ను 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. ఢీకొట్టిన లారీ డ్రైవర్ కునుకు తీయడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మద్యం బాటిళ్ల ప్లాస్టిక్‌వి కావడంతో నష్టం పెద్దగా ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

వేటకు వెళ్ళి నిజాంపట్నం చెందిన మత్స్యకారుడు మృతి


నాగవర్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ తిరుపతిరావు

రేపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేటకు వెళ్ళి నిజాంపట్నం కలిమి సెంటర్‌కు చెందిన ఒడుగు నాగవర్మ(24) మృతి చెందాడని నిజాంపట్నం ఎస్ఐ తిరుపతిరావు బుధవారం తెలిపారు. నిజాంపట్నం మండలం దిండి పరిశావారిపాలెం బీచ్ వద్ద వేటకు వెళ్ళి ప్రమాదవశాత్తు మునిగి పోవటంతో గాలింపుచర్యల్లో నాగవర్మ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఎస్ఐ పరిశీలించారు. నాగవర్మ తండ్రి నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

మిర్చిని తగలబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

కారంపూడి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు మిర్చి పంటకు నిప్పంటించారు. బాధిత రైతు వజ్రాల సురేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేసి రెండో కోత పూర్తి చేసి మార్కెట్‌కు తరలించేందుకు 50 క్వింటాళ్ల ఎండు మిర్చిని కల్లంలో నిల్వ చేశాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పంటను తగులబెట్టారు. సుమారు రూ. 6 లక్షలు నష్టం జరిగినట్లు బాధితుడు సురేష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ వాపోయాడు.

పురుగుమందు తాగి వ్యాపారి ఆత్మహత్య

ప్రత్తిపాడు. మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మనస్థాపంతో పత్తి కమీషన్ వ్యాపారి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన పాతమల్లాయపాలెం సమీపంలో జరిగింది. పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన కాసు నాగిరెడ్డి (56) పత్తి కమీషన్ వ్యాపారం చేస్తూ గుంటూరులో నివాసం ఉంటున్నాడు. పది సంవత్సరాలుగా నాగిరెడ్డి రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తిని బొమ్ము కొండారెడ్డికి అమ్ముతుంటాడు. శ్రీకాకుళం జిల్లా దిమ్మిడిజోలా గ్రామపరిధిలో రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తికి సంబంధించి రూ.43 లక్షలు కొండారెడ్డి నుంచి రావలసి ఉంది. ఈ డబ్బు కొండారెడ్డి ఇవ్వకపోగా, కోర్టుకు వెళతా అంటూ బెదిరిస్తున్నాడు. ఒక వైపు రైతుల నుంచి డబ్బుల కోసం వత్తిడి పెరిగి పోవడం, మరో వైపు తనకు ఇవ్వాల్సిన కొండారెడ్డి బెదిరిస్తుండటంతో తీవ్ర మనస్థాపానికి గురైన కాసు నాగిరెడ్డి అప్పులకు సంబంధించి వివరాలతో నోట్ రాసి పొలం వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు నాగిరెడ్డి భార్య రాజ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

పాము కాటుకు రైతు మృతి

నకరికల్లు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పాము కాటుకు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని నరసింగపాడు గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోనముక్కల పరమేశ్వర రెడ్డి పొలంలో గేదెలకు గడ్డి కోసే సమయంలో పాము కరవటంతో స్పృహ తప్పి పడిపోయాడు. అతనిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్లు ఈ సందర్భంగా వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	109, 117, 128
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

1,24,077 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,27,005 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,24,077 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 66,903 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10500	13800
334	9500	13100	బంగారం	11000	12500
నంబరు. 5	10000	13500	బ్యాడిగి 355	--	--
273	10000	13000	సింజెంటా బ్యాడిగి 5531	10000	13500
341	10500	14500	ఎస్ఎస్ 250 బుల్లెట్	10000	11500
4884	10000	12000	ఆర్మూరు	11000	13300
సూపర్ 10	--	--	తాలుకాయలు	5000	7500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	--	--			

నేటి కౌన్సిల్ సమావేశం వాయిదా

గుంటూరు కార్పొరేషన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థలో నేడు జరగాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు కౌన్సిల్ సెక్రటరీ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కొద్ది రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. నగరంలోని అందరు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు నోటీసులు పంపించారు. ఇన్‌చార్జి మేయర్ నియామక విషయాన్ని ప్రభుత్వం ఇంతవరకు తేల్చకపోవడంతో ఈ సమావేశం వాయిదాపడింది.

ప్రతిరోజు నిర్దిష్ట సమయానికి ఆహారం అందించాలి

- కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్లలో ప్రతిరోజు నిర్దేశిత సమయానికే ఆహారం అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం బస్టాండ్ దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి, ప్రజలతో మాట్లాడి, సిబ్బం దికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లను ప్రతిరోజు నిర్దేశిత సమయానికి ఆహారం అందించాలన్నారు. క్యాంటీన్ల వద్ద మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

అనధికారిక నీటి తరలింపు నిలిపివేయాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు నగర పాలక సంస్థ రిజర్వాయర్ల నుంచి అనధికారికంగా తాగునీటి తరలింపుని నిలిపివేయాలని, తమ రోజువారీ పర్యటనల్లో, ఆకస్మికంగా రిజర్వాయర్లను తనిఖీ చేస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ బీఆర్ స్టేడియం రిజర్వాయర్‌ని ఆకస్మికంగా తనిఖీ చేసి, ట్యాంకర్ల ద్వారా నీటి తరలింపును పరిశీలించి, రిజిస్టర్ ప్రకారం ఆయా ట్యాంకర్లు నీటి సరఫరా చేసినట్లు నమోదు చేసిన ప్రగతి నగర్‌కు నేరుగా వెళ్లి స్థానికులను అడిగి తెలుసుకొని, రిజిస్టర్‌లో ట్యాంకర్ల ట్రిప్పుల నమోదు నిర్లక్ష్యంపై సంబంధిత ఆప్కాస్ ఉద్యోగిని తక్షణం సదరు విధుల నుంచి తొల గించి ఇతర విభాగంలో విధులు కేటా యించాలని ఎస్‌ఈని ఆదేశించారు. బీఆర్ స్టేడియం రిజర్వాయర్‌లో పైప్‌లైన్ లీకులకు మరమత్తు చేపట్టి నీటి వృథాని అరికట్టాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్ చిస్తి, డీఈఈ నాగభూషణం, ఎస్ఎస్ రాంబాబు, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు

- గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఈ కళ్యాణ్ చక్రవర్తి

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామీణ నీటి సరఫరాశాఖ ఆధ్వర్యంలో 15 మండలాలు ఉం డగా వాటిలో 324 గ్రామాలు ఉన్నట్లు ఎస్ఈ కళ్యాణ్ చక్రవర్తి ఆంధ్రజ్యోతికి తెలిపారు. వాటిలో కేవలం 15 గామాల్లో మాత్రమే తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడుతుందని చెబుతున్నారు. ఆయా గ్రామాలకు మార్చి ఆఖరు నుంచి జూన్ వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే ఆరు మండలాల్లోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఈ పేర్కొన్నారు. ఆయా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపేం దుకు రూ.34 లక్షల వరకు వ్యయం అవుతుందని ప్రభుత్వానికి తెలిపామన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య), మార్చి 19(ఆంధ్రజ్యోతి): బీసీ, కాపు (కాపు, బలిజ, తెలగ, ఒంటరి), ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సామాజిక వర్గాలకు చెందిన వారు తమ దరఖాస్తులు ఏపీ ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 22లోగా దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా పంపాలని సూచించారు. ఆయా సామాజిక వర్గాలకు చెందిన వారు తమ కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టీచర్ల బదిలీ చట్టంపై హర్షం : యూటీఎఫ్

గుంటూరు(విద్య), మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉభయ సభల్లో టీచర్ల బదిలీ ల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన చట్టం ఆమోదం పొందడంపై హర్షం వ్య క్తం చేస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్‌రావు, ఎం కళాధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్ల బదిలీలు జరిగిన ప్రతిసారి నెలల తరబడి బదిలీల కార్యక్రమం కొనసాగి పాఠశాలలో బోధనకు తీవ్ర అంతరాయం ఏర్పడే పరిస్థితి ఇక ఉండదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వారి సమస్యలను బట్టి సంఘాలను, ప్రభుత్వాలను ఒత్తిడి చేసే పరిస్థితి ఉండదని, కోర్టులకు వెళ్లే పరిస్థితి కూడా ఉండదని వేసవిలోనే బదిలీలు జరిగే అవకాశం ఉంటుందని తెలియజేశారు. విద్యా సంవత్సరంలో మధ్యలో ఈ బదిలీల గందరగోళం ఉండదని అన్నారు. భవిష్యత్ లో సిఫార్సు బదిలీలకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు జరిపి చట్టం పటిష్ఠంగా అమలు జరపాలని కోరారు.

అండర్ బ్రిడ్జి నిర్మించిన తర్వాతే ఫ్లైఓవర్ పనులు ప్రారంభించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 19(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన శంకరవిలాస్ బ్రిడ్జి నిర్మాణంలో ముందుగా అండర్ బ్రిడ్జి నిర్మించి తర్వాత మాత్రమే రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పలు ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వర్గాలు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక అరండల్‌పేట గీతా రిజెన్సీలో శంకర్ విలాస్ ఫ్లైఓవర్ నిర్మాణంపై సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్రముఖ ఆర్కిటెక్చర్ ఇంజనీర్ కేఎస్ఆర్ కుటుంబరావు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.98 కోట్లు సరిపోవని అన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శంకరవిలాస్ బ్రిడ్జితో వ్యాపారులకు నష్టంతోపాటు అరండల్‌పేట, బ్రాడీపేట మధ్య అను సంధానం దెబ్బతినే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ మరో రూ.30, 40 కోట్లు కేటాయించుకొని హిందూ కళాశాల కూడలి నుంచి అంబేద్కర్ విగ్ర హం వరకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో జన చైతన్యవేదిక అధ్యక్షు డు వీ లక్ష్మణరెడ్డి, ఎల్ భారవి, కె.నళినీకాంత్, మట్టుపల్లి వెంకటసుబ్బారావు, నడింపల్లి గురుదత్, అవగాహన శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుటుంబరావు, పాల్గొన్న ఏల్చూరి వెంకటేశ్వర్లు తదితరులు

కొనసాగుతున్న పది పరీక్షలు

గుంటూరు(విద్య), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన పరీక్షకు 27,625 మంది హాజరుకావాల్సి ఉండగా 27,478 మంది హాజరయ్యారుని డీఈవో సీవీ రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్య పరీక్షకు 1039 మందికిగాను 836 మంది హాజరయ్యారని తెలిపారు. రాష్ట్ర పరిశీలకురాలు పి.పార్వతి 6 కేంద్రాల్లో, డీఈవో సీవీ రేణుక 7 కేంద్రాల్లో, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది 60 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా కూడా కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

అంజుమన్ నూతన కమిటీ నియామకం

గుంటూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : అంజుమన్ ఈ ఇస్లామియా సంస్థకు నూతన కమిటీని ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షుడిగా తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ నియమితులయ్యారు. కార్యదర్శిగా షేక్ సైదా, కోశాధికారిగా మొహమ్మద్ జాహిద్, సభ్యులుగా డాక్టర్ అన్వర్ హుస్సేన్, సయ్యద్ అబ్దుల్ రెహమాన్, మహమ్మద్ అహ్మద్ షరీఫ్, షేక్ మహమ్మద్ రఫీ, మహమ్మద్ షౌకత్, మహమ్మద్ నజీర్, షేక్ మక్బుల్, అబ్దుల్ సలామ్ అలియాస్ బాషి తదితరులను నియమించారు. ముస్లిం మత పెద్దల సూచల మేరకు ఈ నూ తన కమిటీని నియమించినట్లు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ అధికారి ఈ మేరకు కమిటీ నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

అయితే మాకేంటి..!

- ఖాళీ స్థలాల్లో జీఎంసీ హెచ్చరిక బోర్డులు
- యజమానుల నిర్లక్ష్యం
- స్థానికులకు తీవ్ర ఇబ్బందులు



నల్లపాడు రోడ్డులోని ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన జీఎంసీ హెచ్చరిక బోర్డు

గుంటూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నగరంలో మురికి కూపాలుగా మారిన ఖాళీస్థలాలు పరిసర ప్రాంత ప్రజలతో పాటు నగరపాలక సంస్థ (జీఎంసీ)యంత్రాంగానికి పెద్ద సమస్యగా మారాయి. ఖాళీ స్థలాలను బాగు చేసుకొనేలా యాజమానులకు జీఎంసీ అధికారులు చేస్తోన్న ఆదేశాలు సైతం బేఖాతరు చేస్తున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలను యథేచ్ఛగా వదిలేయటంతో అవి మురుగునీరు, వ్యర్థాలు, విషకీటకాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇటీవల వీటిపై ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాలపై కమిషనర్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఖాళీ స్థలాలు శుభ్రపరుచుకోవాలని సచివాలయ సిబ్బంది యజమానులకు తెలియజేస్తున్నారు. అయినా కొంతమంది యజమానులు పెడచెవిన పెడుతున్నారని సిబ్బంది వాపోతున్నారు. దీంతో ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వారికి నోటీసులు అందజేయటంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రజల జీవనోపాధిని మెరుగుపర్చటంపై శ్రద్ధ చూపాలి

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజల జీవనోపాధిని మెరుగు పర్చి పేదరికాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో అమలుచేస్తున్న స్వయం ఉపాధి పథకాలకు, పరి శ్రమల ప్రోత్సాహానికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేసి ఆర్థిక అభి వృద్ధి రేటులో జిల్లా ముందంజలో ఉండేలా బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కృషి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మంది రంలో కలెక్టర్ అధ్యక్షతన డిసెంబరు త్రైమాసికంకు సంబంధించిన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశం (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం (డీఎల్ఆర్సీ) సమావేశం జరిగింది. జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2024-25లో భాగంగా 2024 డిసెంబరు 31 త్రైమాసికం వరకు సాధించిన పురోగతి వివరాలను కలెక్టర్ నాగలక్ష్మికి లీడ్ బ్యాంక్ మేనేజరు మహిపాల్‌రెడ్డి తెలియజేస్తూ వ్యవసాయ రంగానికి రూ.13,613.86 కోట్ల రుణ లక్ష్యానికి రూ.12,565.67 కోట్లు (92.30శాతం), ఎంఎస్ఎంఈ రంగానికి రూ.9,495.21 కోట్ల రుణ లక్ష్యానికి 8,792.15 కోట్లు (92.59 శాతం) మొత్తంగా ప్రాధాన్య రంగానికి రూ.24,501.93 కోట్ల రుణ లక్ష్యానికి రూ.21,855.44 కోట్లు (89.19 శాతం) సాధించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలు పీఎంఎస్‌బీవై క్రింద 54,883 నమోదు చేసుకోగా, పీఎం జేజేబీవై కింద 27,452 మంది నమోదు చేసుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ రుణ పథకాలైన పీఎం విశ్వకర్మ పథకంలో 2025 మార్చి 7 తేదీ నాటికి 417 మందికి రుణాలు అందజేసినట్లు, పీఎం సూర్యఘర్ పథకం ద్వారా 1041 మందికి రుణాలు ఇచ్చినట్లు, పీఎంఈజీపీ పథకం ద్వారా 112 మంది లబ్ధిదారులకు (110 శాతం లక్ష్యం సాధించినట్లు) పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా 31మందికి రుణాలు అందించినట్లు తెలిపారు. సమావే శం అజెండా అంశాలపై జరిగిగిన చర్చ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోను ఒక పారిశ్రామికవేత్త నినాదంతో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో రాయితీతో స్వయం ఉపాధి పథకాల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నందున దీనికి అనుగుణంగా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డీసీసీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ డీజీఎం, రీజనల్ హెడ్ ఎస్ జవహర్, ఆర్బీఐ ఎల్డీవో నవీన్ చిరిసెల్లి, నాబార్డు డీడీఎం జి.శరత్‌బాబు, లీడ్ బ్యాంక్ మేనేజరు మహిపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ నరసింహారావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీందర్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, మెప్మా పీడీ విజయలక్ష్మి, జిల్ రైతుల సంఘం కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్, సిక్కి రీజినల్ హెడ్ పరిమళ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు

ఖరీఫ్ ప్రణాళిక రూపకల్పన పక్కాగా జరగాలి

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళిక రూప కల్పన పక్కాగా జరగాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం గుంటూరులోని కృషి భవన్‌లో జరిగిన ప్రకృతి వ్యవసాయ ప్రణాళిక రూపక ల్పాన శిక్షణ శిబిరంలో ఆయన ప్రసంగించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ రాజకుమారి అధ్యక్షత వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఖరీఫ్ ప్రణాళిక రూపకల్పనలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సహకారం కూడా చాలా కీలకమైనదని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, రైతు సాధికార సంస్థ కార్యాలయానికి చెందిన గోపీచంద్, ప్రకృతి వ్యవసాయం అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ, ఏవో సుబ్ర హ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం : సీపీఎం

గుంటూరు(తూర్పు), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ట్రూఅప్, సర్దుబాటు చార్జీలు, స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్మిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై నేతాజీ అన్నారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం 'జగన్ సర్కారుపోయి.. బాబు ప్రభుత్వం వచ్చినా... విద్యుత్ షాకులు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ విషయం లో గత ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తూ ప్రజలపై భారాలు మోపుతుం దన్నారు. సమావేశంలో పాశం రామారావు, ఈమని అప్పారావు పాల్గొన్నారు.

బదిలీల్లో దివ్యాంగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో దివ్యాంగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. ఈ మేరకు సచివాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎల్లయ్య మాట్లాడుతూ చట్టంలో ఉన్న అంశాలను పరిశీలించి 40 శాతం వైకల్యం ఉన్న ప్రతి దివ్యాంగ ఉపాధ్యాయులను ప్రాధాన్య కేటగిరిలో చేర్చి బదిలీలు చేయాలన్నారు. 70శాతం పైబడిన వారిని సాధారణ బదిలీల నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, శివ నాగేంద్ర, రమేష్ ఉన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల లోగో ఆవిష్కరణ

గుంటూరు(తూర్పు), మార్చి 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మే 15 నుంచి 18వ తేదీ వరకు జరిగే అఖిలభారత యువజన సమాఖ్య 17వ జాతీయ మహాసభల లోగో ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక కొత్తపేట, సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్‌జీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుభాని తదితరులు పాల్గొని లోగోను ఆవిష్కరించారు. జంగాల చైత న్య, వలీ, అకిటి అరుణ్‌కుమార్, ఖాసిం వలి, రెహమన్, సుభాని పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ విజేత ధనలక్ష్మి కాలేజ్ ఫిజికల్ ఎడ్యుకేషన్



స్థానిక ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న సాఫ్ట్‌బాల్(పురుషుల) పోటీలు బుధవారం ముగిశాయి. పోటీల్లో విజేతగా ధనలక్ష్మి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజి నిలిచింది. విజేతలకు వర్సిటీ పరిశీలకులు డాక్టర్ సూర్యనారాయణ తదితరులు ట్రోఫీని అందజేశారు. - గుంటూరు, విద్య(ఆంధ్రజ్యోతి)

క్రీడాకారులకు అభినందనలు

గుంటూరు(తూర్పు), మార్చి 19(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన ఏపీ స్టేట్ జూడో పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. 55కేజీల విభాగంలో కే అజయ్ కుమార్, డీ విష్ణువర్ధన్, 60కేజీల విభాగంలో డీ పాండురంగారావు, 73 కేజీ, 90కేజీల విభాగాల్లో ఏ లిఖిత్ పవన్‌కుమార్ రజత పతకాలు సాధిం చారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా జూడో అడహక్ కమిటీ ప్రతినిధులు శ్రీహరినాయుడు, కిరణ్‌కుమార్ రెడ్డి, కోచ్ హను మాన్, మాధురి తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

పగటిపూట కూడా 'డ్రంకెన్ డ్రైవ్'

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు కేవలం రాత్రి పూటకే పరిమిత మైన డ్రంకెన్ డ్రైవ్‌ను ట్రాఫిక్ పోలీసులు పగటి పూట కూడా ప్రారంభించారు. నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. కంకర గుంట అండర్ పాస్ కింద ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో సీఐ సింగయ్య, సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వ హించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అతని బైక్ సీజ్ చేశారు. ఇకపై పగటిపూట కూడా తనిఖీలు నిర్వహించనున్నట్లు సీఐ తెలిపారు. అతన్ని కోర్టులో హాజరు పర్చేస్తే.. కోర్టు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. కొన్ని సందర్భాల్లో జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉందని సీఐ వివరించారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం ప్రారంభం

గుంటూరు(తూర్పు), మార్చి 19(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం జేసీ ఏ భార్గవతేజతో కలసి కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు, సిబ్బంది, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్‌కే ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీతపై ఆధ్యాత్మిక ప్రవచనం

గుంటూరు(తూర్పు), మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై జరుబుల బంగారుబాబు, శివకుమారి దంపతుల సౌజన్యంతో బుధవారం శ్రీమద్భగవద్గీత త్రయోదశ అధ్యాయంలోని క్షేత్రజ్ఞ విభాగయోగం ప్రవచనం చేశారు. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, జరుబుల బంగారుబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నర్సింగ్ వృత్తి పవిత్రమైనది

గుంటూరు(తూర్పు), మార్చి 19(ఆంధ్రజ్యోతి): నర్సింగ్ వృత్తిని పవిత్రంగా భావించాలని ఫాదర్ గంజి బాలస్వామి అన్నారు. స్థానిక చౌడవరం, సెయింట్ ఆన్స్ నర్సింగ్ కళాశాలలో బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థినులకు లాంప్ లైటింగ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ఫాదర్ గంజి బాలస్వామి హాజరై ప్రత్యేక పూజాబలిని సమర్పించారు. సిస్టర్ సుమన్ ఇగ్నేషస్ విద్యార్థినులకు నర్సింగ్ వృత్తికి చిహ్నమైన జ్యోతులను అందజేశారు. ప్రిన్సిపల్ సిస్టర్ లీనా మాట్లాడుతూ నర్సింగ్ గొప్పతనాన్ని వివరించారు. పోటీల్లో విజేతలకు నిలిచిన బహుమతులను అందజేశారు.

డీఎంహెచ్ వోకు సత్కారం

గుంటూరు(తూర్పు), మార్చి 19(ఆంధ్రజ్యోతి): గ్రేడ్ 3 ఏఎన్ఎంలకు పదోన్నతులను కల్పించినందుకు గాను బుధవారం ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, ఏఎన్ఎం సంఘ నాయకులైన శ్రీవాణి, అరుణ, పదోన్నతి పొందిన ఇతర ఏఎన్ఎంలతో కలిసి జిల్లా వైద్యశాఖాధికారి విజయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సుకుమార్, ఎస్ సూరి, నాగేశ్వరావు, సీహెచ్ అనిల్ ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి యువకుడి మృతి

- పడేసి ప్రమాదంగా చిత్రీకరించిన గంజాయి బ్యాచ్?
- మృతుడు దివంగత సీఐ బ్రహ్మయ్య తనయుడు

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్థంబాలగరువు వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని మరో వాహనంపై వచ్చి కాలుతో తన్ని పడేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన కేసులో నిందితులను గంజాయి బ్యాచ్‌గా అనుమానిస్తున్నారు. గడచిన కొద్ది రోజులుగా ఈ ముఠా నగరంలో అక్కడక్కడ ఇదేవిధంగా గంజాయి మత్తులో ఈ తరహా నేరాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. రాజేంద్రనగర్‌లో ఉంటున్న మృతుడు హరికిషన్ దివంగత సీఐ బ్రహ్మయ్య రెండో కుమారుడు. గతంలో సీఐ బ్రహ్మయ్యను పల్నాడు ప్రాంతంలో మావోయిస్టులు చంపేశారు. తాజాగా ఎటువంటి సంబంధం లేని హరికిషన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి కాలుతో తన్ని ఆయన మృతికి కారణమయ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ ఘటనకు కారణమైన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. బుధవారం హరికిషన్ మృతదేహానికి అంత్యక్రియలు పూర్తయ్యాయి.



కాలువను తలపిస్తున్న రోడ్డు

స్థానిక ఏటీ అగ్రహారంలోని నాలుగవ లైన్ చివరన ఉన్న బండ్ల బజార్ (అంబేద్కర్ బొమ్మ రోడ్డు)లో మురుగునీరు తటాకంగా మారినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ఏటీ అగ్రహారం(గుంటూరు విద్య)

విస్తృతంగా సీటీ శాఖ వాహన తనిఖీలు

- ప్రైవేటు డ్రైవర్ల చేతివాటం
- సుమారు 10 మంది వరకు విధుల నుంచి తొలగింపు
- అధికారులు, సిబ్బంది కుమ్మక్కుపై ఆరోపణలు



వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం

గుంటూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరాంతం సందర్భంగా వాణిజ్య పన్నులశాఖ అధికారులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ నెలాఖరు నాటికి పన్ను ఏగవేత దారులతో పాటు బకాయిదారులను గుర్తించి వసూళ్ళు చేసే పనిలో ఆ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా గుంటూరు-1, పల్నాడు డివిజన్ల పరిధిలోని అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పన్ను వసూళ్ల కోసం జూనియర్ అసిస్టెంట్ కేడర్ నుంచి డీసీటీవో వరకు సిబ్బందిని ప్రత్యేక టీమ్‌లుగా విభజించి విధులు కేటాయిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చే శాఖల్లో కీలకమైనది వాణిజ్య పన్నులశాఖ (కమర్షియల్ టాక్స్). ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుంటూరు-1, పల్నాడు డివిజన్‌ల జాయింట్ కమిషనర్‌లు శ్రీలక్ష్మీ, గీతామాధురీలు సీటీ శాఖ బకాయిల వసూళ్ళు, వాహన తనిఖీలకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఇటీవల అధికారులు, సిబ్బంది జరిపిన వాహన తనిఖీల్లో కొందరు ప్రైవేటు డ్రైవర్లు చేతి వాటం ప్రదర్శించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీసీటీవోలకు ఉండే వాహనాల డ్రైవర్లు కొందరు వాహన తనిఖీల్లో అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలు ఆ శాఖ జాయింట్ కమిషనర్ల దృష్టికి వెళ్లటంతో రెండు డివిజన్‌ల నుంచి సుమారు పది మంది వాహన డ్రైవర్లను వాహన తనిఖీల విధు లకు వెళ్లొద్దని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. డ్రైవర్లను విధుల నుంచి తప్పించ టం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు వాహన తనిఖీలపై ఉన్నతాధికారులు నిఘాను మరింత కట్టుదిట్టం చేశారు.



ప్రసంగిస్తున్న ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, పక్కన డాక్టర్ శివాజీ, దేవినేని, విష్ణువర్ధన్ తదితరులు

సీతారామయ్య జీవితం నేటి తరానికి ఆదర్శనీయం

- ఘనంగా సీతారామయ్య హైస్కూల్ వార్షిక వేడుకలు
- ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విద్య ప్రదాతగా పేరుగాంచిన పాటి బండ్ల సీతారామయ్య జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు తెలిపారు. బుధవారం పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో జరిగిన వార్షిక వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభకు మాజీ ఎంపీ ఎలమంచిలి శివాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణ రాజు మాట్లాడుతూ సీతారామయ్య శాశ్వత కాలం ప్రజలందరి మనసుల్లో చిరంజీవిగా మిగిలిపోతారన్నారు. 1908లో లాం గ్రామంలో పాఠశాల స్థాపించటం, లాం వ్యవసాయ విశ్వ విద్యాలయానికి 56 ఎకరాల భూమిని విరాళంగా ఇవ్వడం ఎంతో అభినందనీయం. అటు వంటి మహోన్నత వ్యక్తి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. డాక్టర్ శివాజీ మాట్లాడుతూ తక్కువ ఫీజులతో ఇంగ్లిష్ మీడియంలో అందిస్తున్న ఘనత సీతారామయ్య హైస్కూల్‌కి దక్కుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ ప్రసంగించారు. కార్యక్రమంలో నన్నపనేని శేషగిరి రావు, సామ్రాజ్యలక్ష్మి దంపతులు, పాఠశాల పాలక మండల సభ్యులు గింజుపల్లి వర ప్రసాదరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ మహిళా ఉద్యోగుల క్రీడా, సాంస్కృతిక పోటీలు

- రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన మహిళా క్రీడాకారులు

గుంటూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్స్ స్పోర్ట్స్ కౌన్సిల్ విజయవాడ వారి ఆధ్వర్యంలో ఇంటర్ సర్కిల్ క్రీడా, సాంస్కృతిక పోటీలు బుధ వారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. విద్యుత్‌శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగా ల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ పోటీలు తొలి రోజు ఉత్సాహం గా ప్రారంభమయ్యాయి. క్రీడలు ఎన్టీఆర్ స్టేడియంలో ప్రారంభం కాగా సాంస్కృతిక కార్యక్రమాలు సంగడిగుంటలోని విద్యుత్‌భవన్‌లో జరిగాయి. ఈ సాంస్కృతిక కార్యక్రమా లను సీపీడీసీఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్) కే లింగమూర్తి లాంఛనంగా ప్రారంభించారు. కార్య క్రమంలో గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, గుంటూరు టౌన్ -1 డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.



హాజరైన గుంటూరు జిల్లా క్రీడాకారులు

రైల్వేలో పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

- ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ సెక్రటరీ రమణయ్య



ధర్నాలో ప్రసంగిస్తు న్న సంఘ్ డివిజనల్ సెక్రటరీ రమణయ్య

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఉద్యోగులందరికి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ సెక్రెటరీ వీవీ రమణయ్య విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎన్ఎఫ్ఐఆర్, ఎస్‌సీఆర్ఈఎస్‌ల పిలుపు మేరకు పట్టాభిపురంలోని డీఆర్ఎం ఆఫీసులో పాత పెన్షన్ కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ఓపీఎస్ సాధించే వరకు తమ పోరాటం కొన సాగుతుందన్నారు. ప్రతీ గ్యాంగ్ యూనిట్‌కి టూల్ కమ్ రెస్టురూం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ అధ్యక్షుడు వై సురేష్‌బాబు, డిప్యూటీ డివిజనల్ కార్యదర్శి ఎస్‌వీ అర్జున, వర్కింగ్ కమిటీ సభ్యుడు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి కుట్టుమిషన్‌లు దోహదం

గుంటూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధికి కుట్టుమిషన్‌లు దోహదపడతామని కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు అన్నారు. కొరిటిపాడు వినాయ కనగర్‌లో శకుంతలాదేవి జ్ఞాపకార్థం ఆమె కుమార్తె మీనా కుట్టుమిషన్‌లను పేద మహి ళలకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహృద యంతో అందించిన సహాయాన్ని సద్వినియోగం చేసుకొని కుటుంబాన్ని పోషించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, ఐద్వా నాయకురాలు కె.వనలక్ష్మి, వైవీ రమణి, పద్మ, పార్వతి, శ్రీదేవి తదితరులున్నారు.







చిత్రజ్యోతి

SINCE 1965

నాన్నకు ప్రేమతో..


'దక్ష' లో మోహన్‌బాబు



ప్రస్తుతం మంచు కుటుంబంలో యుద్ధవాతావరణం నెలకొని ఉంది. ముఖ్యంగా తండ్రీకొడుకులు మోహన్‌బాబు, మనోజ్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమని మండే పరిస్థితి. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. తను సంపాదించిన ఆస్తులు, కట్టుకున్న ఇల్లు మనోజ్ ఆక్రమించాడని మోహన్‌బాబు స్వయంగా రంగారెడ్డి కలెక్టర్ ఆఫీసుకు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసుల సాయంతో మనోజ్‌ను హైదరాబాద్ జల్‌పల్లిలో ఉన్న తన ఇంటి నుంచి వెళ్లగొట్టారు మోహన్‌బాబు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మోహన్‌బాబు పుట్టిన రోజు వేడుకలు బుధవారం జరిగాయి. తండ్రి పుట్టినరోజు సందర్భంగా మనోజ్ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. 'హ్యాపీ బర్త్‌డే నాన్నా.. మనమంతా కలసి వేడుకలు చేసుకునే ఈ రోజు మీ పక్కనే ఉండే అవకాశాన్ని కోల్పోయా. మీతో కలసి ఉండే క్షణాల కోసం ఎదురు చూస్తున్నా.. లవ్ యూ' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. మనోజ్ పెట్టిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరి దీనిపై మోహన్‌బాబు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

విశ్వామిత్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు

తన తండ్రి మోహన్‌బాబు పుట్టినరోజు సందర్భంగా నటి మంచు లక్ష్మీప్రసన్న ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ముఖ్య పాత్రధారిగా తను నిర్మిస్తున్న 'దక్ష' చిత్రంలోని లుక్‌ను షేర్ చేసి "మా ప్రొఫెసర్, డాక్టర్. విశ్వామిత్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. 'కన్నప్ప' సినిమాలో మోహన్‌బాబు మహదేవ శాస్త్రిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని 'ఓం నమః శివాయ' అనే పాటలో ఆయన పాత్రకు సంబంధించిన వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్.

కడుపుబ్బా నవ్వించే చిత్రం


సప్తగిరి

సప్తగిరి కథానాయకుడిగా నటించిన చిత్రం 'పెళ్లికాని ప్రసాద్'. అభిలాష్‌రెడ్డి గోపిడి దర్శకత్వంలో కె.వై.బాబు, భానుప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్‌రెడ్డి ముత్యాల నిర్మించారు. దిల్‌రాజు నిర్మాణ సంస్థ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ సినిమాను విడుదల చేస్తోంది. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సప్తగిరి. "దర్శకుడు అభిలాష్ ఈ కథ చెప్పేటప్పుడే సినిమా విజయంపై పూర్తి నమ్మకం వచ్చేసింది. అందరినీ కడుపుబ్బా నవ్వించే చిత్రమిది. ఎక్కడా బోర్ కొట్టదు. దర్శకుడు అభిలాష్ రాసిన సంభాషణలు, వినోదాత్మక సన్నివేశాలు, శేఖర్ చంద్ర అందించిన సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

అద్భుతమైన అనుభూతినిచ్చేలా...



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, నిహాల్ కోదాటి, సాన్వీ మేఘన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'టుక్ టుక్'. సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో దర్శకుడు సుప్రీత్ మాట్లాడుతూ "ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినిచ్చేలా సరికొత్తగా ఉంటుందీ సినిమా. అందరి మనసులు గెలుచుకుంటుంది" అని అన్నారు. "సినిమా తప్పక విజయం సాధిస్తుంది" అని నిర్మాత రాహుల్ రెడ్డి చెప్పారు.

బ్యాక్ టు హైదరాబాద్



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ చిత్రం రెండో షెడ్యూల్ పూర్తయింది. ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని డాక్టర్ కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. పదిహేను రోజులుగా ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో ఈ సినిమా షూటింగ్ జరిగింది. సిమిలిగుడ సమీపంలోని మాలి, పుట్‌సేల్, బాల్డ ప్రాంతాల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మంగళవారం రాత్రితో షెడ్యూల్ పూర్తి కావడంతో చిత్ర యూనిట్ హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైంది. యాక్షన్ అడ్వెంచర్ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు రాజమౌళి.

అందమైన ప్రేమకథ



వినయ్‌కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కాలమేగా కరిగింది'. సింగార మోహన్ దర్శకత్వంలో మరే శివశంకర్ నిర్మించారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ శుక్రవారం విడుదలవుతోందీ చిత్రం. తాజాగా, నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో హీరో వినయ్‌కుమార్ మాట్లాడుతూ "కలహాలే లేని అందమైన ప్రేమకథ ఇది" అని అన్నారు. "ఈ కవితాత్మక చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. మంచి విజయం సాధిస్తుంది" అని దర్శకుడు శింగార మోహన్ చెప్పారు. "ఇదో స్వచ్ఛమైన ప్రేమకథ. సినిమా అద్భుతంగా ఉంటుంది" అని నిర్మాత మరే శివశంకర్ తెలిపారు.

మహిళల సమస్యలపై..



షెరాజ్ మెహదీ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓ అందాల రాక్షసి'. విహాన్షీ హెగ్డే, కృతి వర్మ కథానాయికలు. సురీందర్ కౌర్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. హీరో షెరాజ్ మెహదీ మాట్లాడుతూ "ఇది చిన్న చిత్రమైనా.. పెద్ద విజయం సాధిస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతుంది" అని చెప్పారు. హీరోయిన్ కృతి వర్మ మాట్లాడుతూ "ఈ సినిమా కథ వినగానే గూస్‌బంప్స్ వచ్చాయి" అని చెప్పారు. హీరోయిన్ విహాన్షీ హెగ్డే మాట్లాడుతూ "మహిళల సమస్యలపై తీసిన చిత్రమిది" అని తెలిపారు.





రద్దీ ప్రాంతాల్లో డ్రోన్ సహకారంతో నిఘా

మంగళగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండల పరిధిలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్ సహకారంతో నిఘా ఉంచుతున్నట్టు రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేర కు బుధవారం సాయంత్రం ఆత్మకూరు గ్రామ పరిధిలోని జాతీయ రహదారి వెంబడి బస్ స్టాపు, ఆత్మకూరు జంక్షన్ ఏరియాల్లో డ్రోన్ ద్వారా బందోబస్తును పర్యవేక్షించారు. ట్రాఫిక్ నియంత్రణ, అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్‌ఐ వెంకట్ చెప్పారు. అలాగే, నిర్మానుష్య ప్రాంతాల్లో మద్యం తాగడం, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

21న ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్

తాడికొండ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21వ తేదీన పారిశ్రామికవేత్తలకు ఉద్యమ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్, పాన్ కార్డు, ఫోన్ నెంబరు కలిగి ఉన్న పారిశ్రామిక వేత్తలు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రభుత్వం ద్వారా లభించే సౌకర్యాలు, రాయితీలు, అనుమతులు ఎలా పొందవచ్చునో తెలుసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల, గ్రామీణాభివృద్ధి అధికారులు పాల్గొని పారిశ్రామిక వేత్తలకు పూర్తి వివరాలు తెలియజేస్తారన్నారు. నిరుద్యోగులు కార్యక్రమంలో పాల్గొని లబ్ధిపొందాలని చెప్పారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడి మృతి

వట్టిచెరుకూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు గ్రామ పంచాయతీలోని నెహ్రూనగర్ కాలనీలో ఆలస్యంగా వెలుగు చూసిన బాలికపై అత్యాచారం కేసులో నిందితుడైన కాకుమాను థామస్ తీవ్ర గాయాలతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు పోలీసులు ధ్రువీకరించారు. దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం

దుగ్గిరాల మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను దుగ్గిరాల పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మంగళగిరి పరిసరాల నుంచి మట్టిని దుగ్గిరాల పరిసర గ్రామాలకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కేసుల నమోదు, జరిమానా, ఇతర వివరాలు తెలి యాల్సి ఉంది. మంగళవారం స్వాధీనం చేసుకున్న నాలుగు ట్రాక్టర్‌లకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేలు చొప్పున జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాడేపల్లి టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు పురుగుమందు తాగి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన ఘటన తాడేపల్లిలో జరిగింది. ఎస్‌ఐ జేఎస్ రావు వివరాల ప్రకారం.. ఈ నెల 10న స్థానిక ఎన్టీఆర్ కట్టపై నివాసముండే దుర్గా కిషోర్ (32), భార్య నాగేశ్వరిలు గొడవపడ్డారు. ఈ ఘటనలో భార్య నాగేశ్వరితో పాటు ఆమె సోదరుడు రమేష్, అమ్మదేవి, కిషోర్‌పై దాడి చేశారు. మన స్తాపానికి గురైన కిషోర్ ఆత్మహత్య చేసుకోవడానికి పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం బాధితుడిని విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఎనిమిదేళ్ల క్రితం వివాహం కాగా ఇద్దరు పిల్లలున్నారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. కాగా కిషోర్ మృతికి అతడి భార్య, అత్త, బావమరిది కారణమని, న్యాయం చేయాలని కోరుతూ మృతుడి బంధువులు పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పెదనందిపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లమడ వాగులో గుర్తుతెలియని మృతదేహం బుధవారం లభ్యమైంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు-పర్చూరు రహదారిలోని నల్లమడ వాగు బ్రిడ్జి వద్ద నీళ్లపై మృతదేహం తేలియాడుతుందని గమనించిన కూలీలు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి ఎస్‌ఐ మధుపవన్ చేరుకొని మృతదేహాన్ని వెలికి తీయించారు. సుమారు 50సంవత్సరాలు లోపు వయస్సు కలిగి, బ్లూ కలర్ ఫుల్‌హ్యాండ్స్ టీషర్ట్‌తో పాటు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని బాపట్ల ప్రభుత్వాస్పత్రి కి తరలించారు. ఆచూకీ లభ్యమైతే పోలీసులకు 9440900872, 96763 27106 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ప్రకాష్‌నగర్‌లో ఫ్రెండ్లీ పోలీసింగ్

తాడేపల్లి టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణం ప్రకాష్‌నగర్‌లో బుధవారం సాయంత్రం ఎస్‌ఐ జేఎస్ రావు ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను ఉద్దేశించి ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజలు సామరస్య పూర్వకంగా మెలగాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలు ప్రజల దృష్టికి వస్తే తమకు చెప్పాలని చెప్పినవారి పేర్లు గోప్యంగా ఉంటాయని ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని ఎస్‌ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి : ఎస్‌ఐ

కాకుమాను, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ పృథ్వీ ఏకనాథ్ అన్నారు. బాపట్ల- పెదనందిపాడు ప్రధాన రహదారి అప్పాపురం నాగేంద్ర స్వామి పుట్ట వద్ద బుధవారం వాహనాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వాహన చోదకులు సరియైన ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని కారు నడిపే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. పరిమితికి మించి ఆటోలలో ప్రయాణాలు చేయవద్దని చెప్పారు.

గృహాల వద్ద అసంపూర్తిగా ఇంకుడు గుంతలు

- పొక్లెయిరన్‌తో గుంతలు తీశారంటున్న లబ్ధిదారులు
- ఎక్కడి మట్టి అక్కడే వదిలి వెళ్లిన వైనం
- అధికారుల మధ్య కొరవడిన సమన్వయ లోపం



అసంపూర్తిగా వదిలి వేసిన ఇంకుడు గుంత, రోడ్లపైనే వదిలి వేసిన మట్టి కుప్ప

ప్రత్తిపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను కాపాడటం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఇంకుడు గుంతల కార్యక్రమాన్ని అధికారులు అపహాస్యం చేస్తున్నారు. కూలీలతో చేయించాల్సిన పనిని కూడా యంత్రాల ద్వారా చేయించడమే కాకుండా ఎవరికి వారు తమకు సంబంధం లేదంటూ చేతులు దులుపుకుంటున్నారు. ప్రత్తిపాడు మండలంలో పూర్తయిన గృహాల ముందు ఇంకుడు గుంతలు తీస్తున్నారు. ఇందుకు గాను ఒక్కో గుంతకు ఆరు వేల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. గుంతలను ఉపాధిహామీ కూలీలతో తీయించాలనే పక్కా నిబంధన ఉన్నప్పటికీ.. పొక్లెయినర్ ద్వారా గుంతలు తీయించారు. గుంతలు తీయగా వచ్చిన మట్టిన ఎక్కడికక్కడ రోడ్లపక్కనే వదిలి పెట్టి వెళ్లిపోయారు. అయితే తీసిన ఇంకుడు గుంతల పుణ్యమాణి సైడ్ కాలువలు ఎత్తు లేచాయి. దీంతో ఎక్కడి మురుగు నీరు అక్కడే ఆగిపోయే ప్రమాదం ఉంది. వానా కాలం వచ్చిందంటే నీరు మొత్తం రోడ్లపైకి వచ్చే అవకాశం ఉంది. ప్రత్తిపాడు లేఅవుట్‌లోని కొందరు గృహాల వారు మురుగు నీరు ఆగిపోతుందంటూ గగ్గోలు పెడుతున్నారు. దీని వల్ల దోమలుపెరిగి పోవడంతో పాటు దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. రోడ్ల వెంట వేసిన మట్టిని తమనే తీసి వేయాలంటూ అధికారులు చెప్పి వెళ్లారంటూ లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

కాంట్రాక్టర్‌కు వత్తాసుగా ఓ అధికారి

అయితే మండలంలో ఇంకుడు గుంతల వ్యవహారం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. మండలంలో ఓ అధికారి తనకు తనకు సన్నిహితుడైన కాంట్రాక్టర్‌ను నియమించడం వల్ల అధికారులు అతనికి సహకారాలు అందిస్తున్నారనే వాదన గట్టిగా వినిస్తుంది. అధికారుల పర్యవేక్షణ లేకుండానే కాంట్రాక్టర్ తనకు ఇష్టమొచ్చినట్టు పనులు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధిహామీ పథకం అధికారులు తమకు సంబంధం లేదని, మొత్తం కూడా హౌసింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందని చెపుతున్నారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు హర్షణీయం

మంగళగిరి సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): చేనేతలకు ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్యుత్తు హామీని అమలు చేయడంపై ఏపీ చేనేత కార్మిక సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమల్లో భాగంగా చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఉచిత విద్యుత్ జీవో మరో వారం పది రోజుల్లో రానున్న సందర్భంగా ఏడీ కార్యాలయాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా డేటా సమకూర్చుకుని చేనేత కేంద్రాల్లో ఎంక్వయిరీ చేపట్టారని తెలిపారు. సొంత మగ్గంపై నేత నేసే కార్మికులను, అద్దె మగ్గాలపై నేసే కార్మికులను, సహకార సంఘాల్లో మగ్గం నేసే కార్మికులను, చేనేత ఉపవృత్తులు చేసే కార్మికులను నాలుగు రకాలుగా విభజించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించేందుకు అన్ని ఏడీ కార్యాలయాల నుంచి ఎన్యుమరేషన్ జరుగుతుందని, అధికారులు ఎంక్వయిరీకి వచ్చినప్పుడు కార్మికులు అందుబాటులో ఉండి వారు అడిగిన సమాచారాన్ని అందించాలని కోరారు. అర్హులైన ప్రతి నేత కార్మికుడు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఉచిత విద్యుత్ హామీని అమలు చేయడం పై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు చేనేత కార్మిక సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

మలినేనిలో ముగిసిన రోబోటిక్‌పై 36 గంటల ఆర్డాన్



మలినేనిలో ఐవోటీ విత్ రోబోటిక్‌పై ఆర్థాన్‌లో సర్టిఫికెట్లు అందజేస్తున్న జేపీ మోర్గాన్ కంపెనీ డెవలపర్ నిఖిల్

వట్టిచెరుకూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రోబో టెక్నాలజీని ఉపయోగించి సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించుకొనేలా విద్యార్థినులు ఆలోచనలను మెరుగుపరుచుకోవాలని జేపీ మోర్గాన్ కంపెనీ సీనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ సీహెచ్ నిఖిల్ టెక్నో ఫీచర్ ఇండియా ఏఐ-ఎంఎల్ ఇంజనీరు ఈ భాను ప్రకాష్‌లు సూచించారు. మండలపరిధిలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజు ల సీఎస్‌ఈ డేటా సైన్స్ ద్వితీయ సంవత్స రం విద్యార్థినులకు టెక్నో ఫీచర్ ఇండియా ఆధ్వర్యంలో ఐవోటీ విత్ రోబోటిక్స్‌పై 36 గంటల అర్డాన్‌ను నిర్వహించారు. బుధవారం ముగింపు సందర్భంగా ప్రోగ్రాం డెవలపర్ నిఖిల్, టెక్నో ఫీచర్ ఇండియా ఏ-1 ఎంఎల్ ఇంజనీరు భాను ప్రకాష్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విద్యార్థినులు చేస్తున్న ప్రాజెక్టులను పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన విద్యార్థినిలకు పలు సూచనలు చేశారు. సదరు ప్రాజెక్టులను పరిశీలించి విజేతలకు ఎంపిక చేసి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మలినేని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు, ప్రిన్సిపాల్ డాక్టర్ జే అప్పారావు, డేటా సైన్స్ హెడ్ ఎన్ హరికృష్ణ, ఇతర విభాధిపతులు పాల్గొన్నారు.

సర్వతోముఖాభివృద్ధితోనే స్వర్ణాంధ్ర సాధ్యం

- చంద్రబాబుతోనే రాజధాని పురోగతి
- షిల్లాంగ్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ శివాజీ



షిల్లాంగ్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యుడు శివాజిని సత్కరిస్తున్న అధ్యాపకులు

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటిలో బుధవారం బీఏఎస్ విభాగం ఆధ్వర్యంలో ది డెవలప్‌మెంట్ మోడల్స్ ఆఫ్ అమరావతి అండ్ హైద రాబాద్ ఏ హిస్టారికల్ యాస్పెక్ట్ అన్న అంశంపై జరిగిన జాతీయ సదస్సుకు షిల్లాంగ్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యుడు శివాజి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ సర్వతోముఖాభివృద్ధితోనే స్వర్ణాంధ్ర సాధ్యమన్నారు. విజన్ 20-20 పేరుతో అభివృద్ధికి సంబంధించిన భవిష్యత్తును అంచనా వేసి ప్రణాళికాబద్ధంగా హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలబెట్టిన పాలనాదక్షుడు చంద్రబాబునాయుడని పేర్కొన్నారు. కేవలం 15 సంవత్సరాల్లో విజన్ 20-20 అమలు చేసిన నాయ కత్వ పటిమ ఉన్న వ్యక్తికి స్వర్ణాంధ్ర 2047 సాధించడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. కేఎల్ బీఏఎస్ విభాగాధిపతి బి.శివ నాగయ్య మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నాయకత్వంలో అమరావతి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీఏఎస్ విభాగాధిపతి బి.శివ నాగయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రజాపతి, అసోసియేట్ ప్రొఫెసర్ ఆర్ సాయికుమార్, ఉప విభాగాధిపతి కె.అనిల్‌కుమార్, పోటీ పరీక్షల శిక్షణ విభాగాధిపతి పి.శ్రీనివాసరావు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రత్యేక పారిశుధ్య పనుల్లో పాల్గొన్న ఎంటీఎంసీ అధికారులు, సిబ్బంది

మంగళగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ చుట్టూ ఉన్న పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంటీఎంసీ కమిషనరు అలీం బాషా సూచించారు. స్వచ్ఛ మంగళగిరిలో భాగంగా బుధవారం మంగళగిరి పట్టణంలోని 4వ వార్డు ఆంజనేయ స్వామి ఆలయం, ప్రభుత్వ పాఠశాల, ఎస్టీ కాలనీ, ద్వారకానగర్, జెండా చెట్టు సెంటరు, తాడేపల్లి పట్టణంలోని రెండో వార్డులో ఎంటీఎంసీ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టారు. రోడ్లపై చెత్తను తొలగించడంతో పాటు డ్రెయిన్లలో పూడిక తీయించారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అదనపు కమిషనర్ శకుంతల, కార్యదర్శి ఎం.దివ్యకుమారి, ఏఈలు కుమారి, అనూష, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ సుస్మిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్, టీడీపీ నాయకులు మున్నిడి సత్యనారాయణ, వల్లభనేని వెంకట్రావు, మునగాల నాగేశ్వరరావు, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని బైపాస్ రోడ్డు 2వ వార్డులో డీ మార్ట్ పరిసర ప్రాంతాల్లో టీడీపీ నేతలు, ఎంటీఎంసీ సిబ్బంది స్వచ్ఛ భారత్ స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, అన్నెం కుసుమ, ఎంటీఎంసీ అధికారులు పారిశుధ్య సిబ్బంది టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కేబినెట్ ఆమోదం హర్షణీయం

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికను మంత్రి వర్గం ఆమోదించడంపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు అద్దేపల్లి నాగేశ్వరరావు మాదిగ, తాడేపల్లి మండల అధ్యక్షుడు వడ్డేశ్వరం తంబిబాబు మాదిగ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ ఎస్సీ రిజర్వేషన్ అమలు కోసం రాజీవ్ రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదికకు క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు.

వీఆర్ఏల సమస్యలు తీర్చండి



రాష్ట్ర సచివాలయంలో వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి అనగాని

ఫిరంగిపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 20 వేల మంది వీఆర్ఏలు గౌరవ వేతనంతో విధులు నిర్వహిస్తున్నారని, 60 సంవత్సరాలు నిండిన వారి కుటుంబంలో ఉద్యోగం కల్పించాలని వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ ధైర్యం చేతుల మీదుగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాదుకు మంగళవారం వినతి పత్రం అందజేశామని గుంటూరు జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు రోశయ్య అన్నారు. నామిని, పే స్కేల్‌తో కూడిన వేతనం ఇవ్వాలని కోరామన్నారు. అలాగే వీఆర్ఏలను నైట్ వాచ్‌మెన్ అటెండరు లాంటి రెగ్యులర్ పోస్టుల ద్వారా భర్తీ చేయాలని, రూ.500 డీఏను కొనసాగించాలని, గత ప్రభుత్వం మూడు వందలు డీఏ కోసం రూ.10వేలు కట్టించుకున్నదని, ఆ పదివేలును తిరిగి వీఆర్ఏలకు ఇప్పించాలని వినతి పత్రంలో కోరామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీ ప్రభాకరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు సురేష్, శ్రీనివాసులు, కేదాసు తదితరులు పాల్గొన్నారన్నారు.

కౌలురైతు చట్టాన్ని పునరుద్ధరించాలి

దుగ్గిరాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సన్నకారు, చిన్నరైతులు, కౌలురైతుల రక్షణ కోసం 2011 కౌలురైతు చట్టాన్ని పునరుద్ధరించాలని కౌలురైతుసంఘ జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు అన్నారు. కౌలురైతు సమస్యలపై కౌలు రైతులు, రైతుసంఘాల నాయకులతో కలిసి చిలువూరులోని సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి శరత్‌కు వినతిపత్రం అందించారు. నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కౌలురైతుకార్డులు లేక అనేక మంది భూయజమాని అనుమతి పత్రాలివ్వక బ్యాంకు రుణాలు రాక ఇబ్బంది పడుతున్నారని, ఈక్రాప్ బుకింగ్ చేయకపోవడంతో పంటను విక్రయించే అవకాశం కూడా లేకుండా పోతోందన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉన్న 2011 కౌలురైతు చట్టాన్ని అమలు చేయాలని అన్నారు. గొట్టిముక్కల బాలచంద్రుడు, కోట ప్రభాకరరావు, దేవినేని బుజ్జి, మండవ సునీత, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్స్ పంపిణీ



విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్స్ పంపిణీ చేస్తున్న ఉప్పుటూరి చినరాములు

ప్రత్తిపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉప్పుటూరి చినరాములు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎన్ఆర్ఐ రామ్‌చౌదరి సహకారంతో ట్రస్టు ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిన్నారు. అందులో బాగంగానే పరీక్షలు రాసి వెళుతున్న విద్యార్థులకు ట్రస్టు చైర్మన్ ఉప్పుటూరి చినరాములు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి సీపీఎం ప్రజా చైతన్య యాత్రలు

మంగళగిరి సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో ప్రజా చైతన్య యాత్రలు జరుగుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు తెలిపారు. మంగళగిరి సీపీఎం కార్యాలయంలో బుధవారం రాత్రి జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొత్తగా చట్టాలను తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాసేందుకు పూనుకుందని ధ్వజమెత్తారు. ప్రజా చైతన్య యాత్రల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందన్నారు.

తాడేపల్లి (ఉండవల్లి) (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాచైతన్య యాత్రలు చేపట్టిందని వాటిని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం ఉండవల్లి సీపీఎం కార్యాలయంలో జరిగిన రాజధాని డివిజన్ కమిటి సమావేశంలో నేతాజీ మాట్లాడుతూ రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని రాజధాని అభివృద్ధికి నిధులను కేంద్రమే గ్రాంట్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం భాగ్యరాజు, జె.నవీన్‌ప్రకాష్, టి.బక్కిరెడ్డి, పేరం బాబూరావు, పార్వతి నంద, షేక్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

తుళ్లూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎంపీడీవో శిల్ప తెలిపారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా రాజధాని గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నట్టు చెప్పారు. మురుగు కాల్వల్లో యాంటీ లార్వా స్ప్రే చేస్తున్నామన్నారు. ఆరోగ్య సిబ్బంది , పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో పారిశుధ్యాన్ని పూర్తి స్థాయిలో మెరుగుపరుస్తామని చెప్పారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రామస్థుల సహకారంతో నిర్వహిస్తున్నామని చెప్పారు.

రాజధానిలో ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన



సీఆర్డీఏ అధికారులతో సమావేశమైన ప్రపంచ బ్యాంకు బృందం

తుళ్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రపంచ బ్యాంకు బృందం బుధవారం పర్యటించింది. లింగాయపాలెం, తుళ్లూరు, గ్రామాల్లో పర్యటించింది. ఆర్థిక, సామాజిక విషయాలను పరిశీలించింది. అమరావతి అభివృద్ధిపై ప్రపంచ బ్యాంకు బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. రాజధానిలో అమలు జరుగుతున్న పింఛన్‌పై ఆనందం వ్యక్తం చేశారు, పేదలుంటున్న టిట్కో ఇళ్ల వద్దకు వెళ్లి పర్యవేక్షించింది. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.9వేల కోట్లతో జరిగిన అభివృద్ధి పనులను బృందం పరిశీలించింది. అనంతరం తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో అధికారులతో ప్రపంచ బ్యాంకు బృందం సమావేశం నిర్వహించింది. రాజధాని మాస్టర్ ప్లాన్ అద్భుతం అని బృంద సభ్యులు కొనియాడారు. ప్రపంచంలోనే అమరావతి నగరం ఒక గొప్ప నగరంగా ఉండబోతుందన్నారు.

మహిళలపై నేరాలు అరికట్టాలి



డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను కలిసిన ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, కాదంబరి జత్వాని తదితరులు

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక నేరాలు అరికట్టాలని కోరుతూ మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డీ రమాదేవి, సినీ నటి కాదంబరి జత్వాని, డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. కాదంబరి జత్వానిపై గత ప్రభుత్వంలో అక్రమంగా కేసు రిజిష్టరు చేశారని ఆ కేసును వెంటనే ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరగా కేసును పూర్తి చేయాలని డీజీపీని కోరగా 15 రోజుల్లో పూర్తి సమాచారం మళ్లీ తెలియజేస్తామని ఆయన చెప్పారు. కాగా గతంలో విశాఖపట్నంకు చెందిన గంగ అనే మహిళలను పోలీసులు ఓ చోరీ కేసు ఆరోపణతో తీవ్రంగా కొట్టారని సంబంధిత పోలీసులపై చర్య కూడా తీసుకోవాలని కోరారు. జత్వాని కేసు వ్యవహారం కూడా వివరించి మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని డీజీపీని కోరారు. అలాగే పలు సంఘటనలపై రమాదేవి ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకుంటామని డీజీపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాదంబరి జత్వాని, అమలశ్రీ, శ్రీదేవి, తదితరులు కలిశారు.

కోల్డ్ స్టోరేజి ప్రమాద బాధితులకు పరిహారమివ్వాలి

- ఏపీ పసుపు రైతుసంఘ రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకర్



అగ్నిప్రమాద బాధిత రైతులతో మాట్లాడుతున్న జొన్నా శివశంకర్

దుగ్గిరాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కోల్డ్‌స్టోరేజిలో జరిగిన అగ్ని ప్రమాదం లో పంట నష్టపోయిన రైతులందరికీ ఏప్రిల్ మొదటి వారం లోగా నష్ట పరిహారం అందించాలని ఏపీ పసుపు రైతుసంఘ రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకర్ అన్నారు. కోల్డ్‌స్టోరేజి ప్రమాద బాధిత రైతులతో సమావేశం దుగ్గిరాల పసుపు యార్డులో బుధవారం నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ గతేడాది జనవరి 19న శుభంమహేశ్వరి కోల్డ్‌స్టోరేజిలో జరిగిన ప్రమాదంలో 296మంది రైతులు, 173 మంది వ్యాపారులున్నారన్నారు. వారందరికీ క్వింటాల్‌కు రూ.7వేల వరకూ పరిహారం అందిస్తామని, బీమా సంస్థలతో మాట్లా డతామని అధికారులిచ్చిన హామీనేటికి నెరవేర్చలేదన్నారు. ప్రమాదం జరిగాక రూ.15కోట్ల వరకూ వంరకు బీమా మంజూరైందన్నారు. బీమాసంస్థలు రెండు విడతలుగా రైతుల బాండ్లను పరిశీలించినప్పటికీ పరిహారం అందించే విషయంలో తీవ్రజాప్యం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, రైతులకు పరిహారం వెంటనే అందించేలా బీమా సంస్థలపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వేముల వెంకట్రామయ్య, ములకా శివసాంబిరెడ్డి, జెట్టి బాలరాజు, అమ్మిరెడ్డి శ్రీహరి, భాస్కరరెడ్డి, వెంకటప్పారెడ్డి పలువురు రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేయాలి

- టీడీపీ మండల సమావేశంలో నాయకుల తీర్మానం

తుళ్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని అందుకు పార్టీ కార్యకర్తలు పని చేయాల్సిన ఆవశ్యకత ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు అన్నారు. బుధవారం తుళ్లూరు టీడీపీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

చదువుకుంటానన్న బాలిక

- బాలసదనానికి తరలింపు

మేడికొండూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం వలస వచ్చి పేరేచర్ల పొలాల్లో పనిచేస్తున్న బాలిక ఉదంతంపై జిల్లా యంత్రాంగం స్పందించింది. పరీక్ష హాల్లో కాదు వలస వెళ్లి పొలంలో శీర్షికన ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు బుధవారం బాలిక పనిచేస్తున్న పొలాన్ని వెతికి పట్టుకున్నారు. కర్నూలు జిల్లా, కోసిగి మండలం చింతకుంట గ్రామానికి చెందిన సన్నక్కి చిన్నారి చదువులో బాగా రాణిస్తుందని తెలుసుకున్నారు. ప్రస్తుత కుటుంబ పరిస్థితి కారణంగా పరీక్షలకు ఫీజు కట్టినా ప్రిపేర్ కానందున రాయలేకపోయానని చెప్పింది. సప్లిమెంటరీ పరీక్ష రాస్తానని, పైచదువులు కొనసాగిస్తానని చిన్నారి అధికారులకు తెలిపింది. చిన్నారి కుటుంబసభ్యులకు అవగాహన కల్పించి బాలికను అధికారులు బాల సదనానికి తరలించారు. ఎంఈవో అబ్దుల్ హలీమ్‌తో పాటు కార్మికశాఖ సిబ్బంది హాజరయ్యారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోండి

● చీఫ్ పార్మసీ ఆఫీసర్ జె.ఝాన్సీ

తెనాలి రూరల్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): వైద్యశాలకు వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స నిమిత్తం వచ్చే రోగులకు అవసరమైన మందులను ఫార్మసిస్టులు అందుబాటులో ఉంచుకోవాలని చీఫ్ పార్మశీ ఆఫీసర్ జె.ఝాన్సీ చెప్పారు. బుధవారం ఆమె పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఫార్మసీ విభాగాన్ని పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందులు, వాటిపై ముద్రించిన తారీఖులు, పంపిణీ చేసిన మందుల రికార్డులు వంటి వాటిని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టాక్ రికార్డులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తక్కువగా ఉన్న వాటిని సకాలంలో ఇండెంట్ పెట్టి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం అనారోగ్యంతో వైద్యశాలకు వచ్చే పేద రోగుల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీటవేస్తోందన్నారు. నాణ్యమైన వైద్యంతో పాటు అవసరమైన మెడిసిన్‌ను పూర్తి ఉచితంగా అందించేలా స్పష్టమైన ఆదేశాలిచ్చిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు. ఆమె వెంట వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



వెనిగండ్ల సుందరయ్య కాలనీ వద్ద ప్రధాన రహదారిపై ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభాలు

● ప్రధాన రహదారి పైకి ఒరిగిన స్తంభాలు
● బిక్కుబిక్కుమంటున్న సుందరయ్య కాలనీ వాసులు
● ఫిర్యాదుచేసినా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

పెదకాకాని, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో వెనిగండ్ల, అగతవరప్పాడు గ్రామానికి చెందిన ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారికి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ఎప్పుడు కూలుతాయోనన్నట్లు ప్రమాదకరంగా ఉన్నాయి. దీనిపై గ్రామస్థులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. రోజూ రద్దీగా ఉంటే ప్రధాన రహదారిపైకి స్తంభాలు ఒరిగి ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. వెనిగండ్ల సుందరయ్య కాలనీ వద్ద రెండు విద్యుత్ స్తంభాలు, వెనిగండ్ల నుంచి అగతరపాడు వెళ్లే ప్రధాన రహదారిపై శ్మశానం సమీపంలో రెండుచోట్ల విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉన్నాయి. ఈ రెండు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా అగతవరప్పాడు నుంచి వెనిగండ్ల, కొప్పురావూరు, కంతేరు గ్రామాల మీదుగా రాజధానికి పోయేందుకు ఈ రహదారి ఎంతో ప్రధానమైనది. దీంతో నిత్యం వందలాది మంది ప్రజలు వివిధ వాహనాలలో తిరుగుతూ ఉంటారు. ఈ ఒరిగిన విద్యుత్ స్తంభాలతో ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

● కలెక్టర్ నాగలక్ష్మి



కొల్లిపర హాస్పటల్‌లో రోగులతో మాట్లాడుతున్నకలెక్టర్ నాగలక్ష్మి

కొల్లిపర, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సబ్‌కలెక్టర్ సంజనాసింహాతో కలిసి తనిఖీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలో పలు విభాగాలను పరిశీలించారు. ప్రతి రోజు ఎంత మంది రోగులు హాస్పటల్ వచ్చి వైద్యసేవలు పొందుతున్నారో వాటి రికార్డులను, పేషెంట్లకు ఇస్తున్న మందులను, మందుల స్టాక్ వివరాల రిజిస్టర్లను పరిశీలించారు. ప్రజలకు అవసరమైన మందులు ఉన్నాయా లేవా అని మెడికల్ ఆఫీసర్ భరత్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులతో ముఖాముఖి మాట్లాడి వైద్యసౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం పేదప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడం కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రోగులకు 24గంటలు అందుబాటులో వైద్యసేవలు అందించాలన్నారు. తనిఖీలో సర్పంచ్ పిల్లి రాధిక, జిల్లా వై ద్యాధికారి విజయలక్ష్మి, తహసీల్దార్ సి ద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం: కలెక్టర్

క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎంఆర్ ప్యూచర్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి జిల్లా ఆసుపత్రుల సేవల కో-ఆర్డినేటర్ మజీదాబేగం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ ఎంఆర్ ప్యూచర్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ కొల్లి మేఘనారెడ్డి సామాజిక సేవలో అంకిత భావంతో క్షయవ్యాధిగ్రస్తులకు నిరంతరం పౌష్టికాహారాన్ని అందించేందుకు ముందుకు రావటం చాలా గొప్ప విషయమన్నారు. 43 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎంఆర్ ప్యూచర్ ఫౌండేషన్ సంస్థ క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు చెప్పారు. మున్ముందు ప్రాథ మిక ఆరోగ్యకేంద్రానికి రూ.8 లక్షల విలువైన వైద్యపరికరాలు అందజేసినట్లు తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం ఉచిత మందులతో పాటు నెలకు వెయ్యి రూపాయల నగదు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, నోడల్ అధికారి డాక్టర్ రమేష్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, తెనాలి సబ్‌క లెక్టర్ సంజనాసింహతో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల కోసం కల్పించిన మౌలిక సదుపాయాలను, మెడికల్ క్యాంపులో ఏర్పాటు చేసిన మందులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, మండల విద్యాశాఖాధికారి ఝాన్సీలత తదితరులు ఉన్నారు.



క్షయవ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, సబ్‌కలెక్టర్ సంజనాసింహ, మేఘనారెడ్డి

టీడీపీని నిలబెట్టిన ఘనత కార్యకర్తలదే

● పట్టణ, మండల అధ్యక్షులు తాడిబోయిన, కేసన



పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు హరిప్రసాద్

తెనాలి రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అన్న ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తట్టుకుని ఆస్తులను సైతం కోల్పోయి నేటికి పదిలంగా నిలబెట్టిన ఘనత పార్టీ కార్యకర్తలదేనని ఆ పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావులు అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో, కార్యకర్తలతో భవిష్యత్తు కార్యాచరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో కార్యకర్తలతో నడిచే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు అధినేత తగిన గుర్తింపు ఇచ్చేలా రాబోయే రోజుల్లో కార్యాచరణ జరుగుతుందన్నారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన వివిధ పనులపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహమ్మద్ ఖుద్దూస్, చినకోటిరెడ్డి, జొన్నాదుల మహేష్, కంచర్ల ఏడుకొండలు, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, ఈదర వెంకట పూర్ణచంద్, మల్లవరపు విజయ్‌కుమార్, అశోక వసంతం, బొంత సాంబయ్య, కొప్పరావూరు కిషోర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు చెల్లించని వారిపై చర్యలు



పన్నులు చెల్లించని వారి వాటర్ పైప్‌లైన్‌లు తొలగిస్తున్న మునిసిపల్‌సిబ్బంది

పొన్నూరు టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంకు సకాలంలో పన్నులు చెల్లించని బకాయిదారులపై చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ముప్పాళ్ల రమేషబాబు తెలిపారు. బుధవారం పురపాలక సంఘంలోని పలు వార్డులను సందర్శించి మొండి బకాయిదారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఏడు రోజుల లోపు ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, తాగునీటి కుళాయి చార్జీలు, చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్, తాగునీటి కుళాయి కనెక్షన్ తొలగించి, మునిసిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ హెచ్చరించారు.

విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలి

● వ్యక్తిత్వ వికాస నిపుణుడు గౌరీ శంకర్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలని రెడ్‌క్రాస్ కార్యదర్శి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు గౌరీ శంకర్ అన్నారు. బుధవారం చేబ్రోలు ఆర్‌వీఐటీ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆత్మవిశ్వాసం, లక్ష్య నిర్దేశం, లక్ష్య చేధన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఒత్తిడిని జయించేందుకు యోగాభ్యాసం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీ కృష్ణయ్య, రెడ్‌క్రాస్ పొన్నూరు వైస్ చైర్మన్ శ్రీనివాస కిరణ్, గణేష్, కళాశాల ప్రెసిడెంట్ ఆర్ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగాన్ని అభివృద్ధివైపు నడిపిస్తున్న ప్రభుత్వం

● రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్

తెనాలి రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తే కూటమి ప్రభుత్వం అభివృద్ధి వైపు నడిపించేలా ప్రణాళికను సిద్ధంచేసి ముందుకు సాగుతోందని రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో చేనేత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తూ ఉచిత విద్యుత్‌పై ప్రకటన చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మగ్గాలున్న చేనేత ఇళ్లకు 200, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు విద్యుత్ ఉచితంగా అందించేందుకు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటన చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దివి అనిత, ఎ.సాంబశివరావు, పి.బాస్కరరావు, దీవిహేమంత్‌కుమార్, గుంటూ వెంకట్, శ్రీనివాసరావు, అక్కల ప్రసాద్, దునుంజయ్, కాటూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సొంత వాహనాలను బాడుగకు తిప్పితే చర్యలు

● ఎంవీఐ రాఘవరావు

తెనాలి క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మారిన మోటారు వాహన నిబంధనల మేరకు సొంతకార్లు, క్యాబ్‌లు అద్దెకు తిప్పిన, ప్రయాణికులను చేరవేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు హెచ్చరించారు. బుధవారం తెనాలి-గుంటూరు మార్గంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ ఇటీవల సొంత కార్లు, క్యాబ్‌లు కలిగిన కొందరు ప్రయాణికులను ఎక్కించుకుని చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. వివిధ సందర్భాలలో వేడుకలు, వివాహాలకు కూడా కాంట్రాక్టు పద్ధతిలో అద్దెకు ఇవ్వడాన్ని గుర్తించామన్నారు. నూతన మోటారు వాహన నిబంధన మేరకు రూ.10-15 వేలు వరకు, 8-13 సీట్లు కలిగిన మాక్సీక్యాబ్‌లకు రూ.20 వేల వరకు అపరాధ రుసుం విధించడం జరుగుతుందన్నారు. వాహనాలు పట్టుబడిన సమయంలో ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు లేకుంటే అదనపు ఫైన్ విధించడం జరుగుతుందన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో తహసీల్దార్ తనిఖీ

తెనాలి అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పదో తరగతి పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. పలు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. తాగునీరు, బెంచీలు, విద్యుత్ సదుపాయాల్లో సమస్యలు రాకుండా చూడాలని కోరారు. కొన్ని కేంద్రాల్లో సరైన బెంచీలు లేకపోవడాన్ని పరిశీలించి వాటిని మార్చాలని సూచించారు.

క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

● స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్



క్షయ వ్యాధిగ్రస్తుని రిపోర్ట్‌ను పరిశీలిస్తున్న స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, పక్కన డాక్టర్ రవికుమార్ తదితరులు

తెనాలి, మారీసుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి రమేష్ అన్నారు. బుధవారం స్థానిక కొత్తపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న క్షయవ్యాధిగ్రస్థులను క్షేత్రస్థాయిలో స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ అధికారులతో కలసి వారికి క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పట్టణంలోని సుల్తానాబాదులోని పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని క్షయవ్యాధి గ్రస్తులను పరిశీలించి వ్యాధి నివారణకు మందులను అందజేసి తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్, ఎం.లక్ష్మి, హెల్త్ విజిటర్లు వీవీ దిలీప్, కె భార్గవి, వనజ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పశు పెంపకందార్లకు ప్రభుత్వం ప్రోత్సాహం

పొన్నూరు టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పశు పెంపకందారులకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని సర్పంచ్ వేజెండ్ల భ్రమరాంబ అన్నారు. మండల పరిధిలోని వల్లభరావుపాలెంలో బుధవారం లేగదూడల ప్రదర్శన జరిగింది. పశు సంవర్థక శాఖ పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనను సర్పంచ్ భ్రమరాంబ ప్రారంభించారు. ఈసందర్భంగా రైతులకు పశువుల పెంపకం లేగదూడలలో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యల గురించి పశు వైద్యాధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ ఏడీ డాక్టర్ కేశవరావు, వైద్యులు డాక్టర్ సీహెచ్ చలపతిరావు, డాక్టర్ షైనీ, డాక్టర్ యాస్మిన్, డాక్టర్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

పేట్రేగుతున్న పెట్రోల్ దొంగలు

● బెంబేలెత్తుతున్న వాహనదారులు
● నిఘా పెంచాలని పలువురి డిమాండ్

తెనాలి, మారీసుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెట్రోల్ దొంగలు పేట్రేగిపోతుండటంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. గత కొంత కాలంగా పట్టణంలోని బాలాజీరావుపేట, మహేంద్ర కాలనీ, నాజరుపేట, రామలింగేశ్వరపేట వంటి పలు ప్రాంతాలలో రాత్రులు ఇంటిముందు నిలిపిన ఉన్న ద్విచక్రవాహనాల నుంచి పెట్రోల్ దొంగలిస్తున్నారు. మరుసటి రోజు వాహన యజమానులు వాహనాన్ని నడిపించే సమయంలో పెట్రోల్ చోరీకి గురయిందని గుర్తించి లబోదిబోమంటున్నారు. ఇలా ప్రతి రోజు వాహనంలో వందల రూపాయల పెట్రోల్ చోరీకి గురికావడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆయా ప్రాంతాలలో సంచరిస్తుండంతో వాహనాలు, తాళాలు వేసిన ఇండ్లలో సైతం చోరీలు జరిగే ప్రమాదం ఉందని ఆయా ప్రాంతవాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న వేసవి కాలం కావడంతో ఆరుబయట నిద్రించేందుకు ప్రజలు ఎక్కువగా ఉంటారు. చోరీలు జరగకుండా పోలీసులు అప్రమత్తమై పెట్రోలింగ్‌ను పెంచాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధి అవకాశాలకు నైపుణ్యాలు అవసరం

తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే తప్పనిసరిగా నైపుణ్యాలు సాధించాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చెప్పారు. బుర్రిపాలెం రోడ్డులోని చంద్రకళ, పీజీ కళాశాలలో గుప్తా డిగ్రీ కళాశాల యాన్యువల్ డే బుధవారం నిర్వహించారు. క్రీడల్లో విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. యూనివర్సిటీ పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులతో కలిపి సన్మానించారు. కార్యక్రమంలో నెహ్రూనికేతన్ ఎండీ మురళీకాంత్, ప్రిన్సిపాల్ విజయకృష్ణ, మేనేజర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు దశరథ రామిరెడ్డి, రవికుమార్, రవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్షం నుంచి భూమికి చేరడం అద్భుతమే

● భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు గోవర్ధనరావు

తెనాలి అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలో సుదీర్ఘకాలం గడిపి భూమికి చేరడం అద్భుతమని భౌతికశాస్త్ర సీనియర్ ఉపాధ్యాయులు సుంకర గోవర్ధనరావు పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో అంతరిక్ష కేంద్రం నుంచి వ్యోమగాములు సునీత విలియమ్స్, విల్‌మోర్‌లు భూమికి చేరిన అంశాన్ని విద్యార్థులకు బుధవారం జరిగిన సమావేశంలో వివరించారు. అంతరిక్ష రహస్యాలను ప్రపంచానికి అందించేందుకు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వెళ్లిన వారి ధైర్య సాహసాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి కావాలన్నారు. కళాశాల కమిటీ అధ్యక్షుడు బొల్లిముంత అమరేశ్వరరావు మాట్లాడుతూ, అంతరిక్షంలో ఎక్కువ కాలం గడిపిన మహిళగా రికార్డు సృష్టించిందని, స్పేస్ వాక్ కూడా చేయడం గొప్ప విషయమని, భారత సంతతికి చెందిన సునీత విలియమ్స్ భారతీయులకు కూడా గర్వకారణమన్నారు. కార్యక్రమంలో బొల్లిముంత శివ రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.



భూ రికార్డులు పరిశీలిస్తున్న జేసీ భార్గవతేజ, తదితరులు

రీసర్వే పారదర్శకంగా పూర్తి చేయాలి

● జేసీ భార్గవతేజ

పొన్నూరు టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భూ సర్వేను పారదర్శకంగా త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని వల్లభరావుపాలెంలో పైలెట్ ప్రాజెక్టుగా సాగుతున్న రీ సర్వేను జేసీ పరిశీలించారు. డ్రాఫ్ట్ నెం.10లో సర్వే నెం.430లో ఉన్న 6.24 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువు సరిహద్దులను రోవర్‌ల ద్వారా నిర్ధారించే ప్రక్రియను జేసీ పరిశీలించారు. అలాగే పొడవైన ఇరుకైన, సన్నని తీక భూములను రోవర్‌ల ద్వారా సరిహద్దులను నిర్ధారించే క్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీచేసి దిశానిర్దేశం చేశారు. గ్రామంలో 771 నెంబర్ల సర్వేలలో 4245ఎకరాల రైతుల భూములతో పాటు 619ఎకరాలు ప్రభుత్వ భూముల రీ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూముల రీ సర్వే ను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పి.పార్థసారథి, తహసీల్దార్ జియావుల్ హక్, డీటీ రాజా రమేష్‌మోహన్, వివిధ విభాగాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు దేవాలయ భూములు అప్పగించాలి

● అసెంబ్లీలో ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ భూములలో నివాసముంటున్న పేదలకు న్యాయం చేయాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అసెంబ్లీలో కోరారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా పేదలు దేవదాయ శాఖకు చెందిన భూములు ఉన్న పెదకాకాని గ్రామ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ, అగతవరప్పాడు గ్రామ పరిధిలోని ఏపీఎస్ కాలనీలలో నివాసం ఉంటున్నారు. పెదకాకాని వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన భూమిలో ఎన్టీఆర్ కాలనీ ఏర్పాటు చేసుకున్నారని, అదేవిధంగా ప్రకాశం జిల్లాలోని అగస్త్యేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూమిలో ఏపీఎస్ కాలనీ ఏర్పడిందన్నారు. వీరందరినీ కూడా ఖాళీ చేయించడం మంచి పద్ధతి కాదని, దేవదాయ శాఖ భూములను నివాసముంటున్న పేదలకు అప్పజెప్పాలని, అందుకు ప్రతిఫలంగా కొంత ఆలయానికి జమ చేస్తే బాగుంటుందన్నారు. దీనిపై దేవదాయ శాఖ మంత్రి తగు నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీలో నరేంద్ర కుమార్ కోరారు.

ప్రారంభమైన సదరం రీ వెరిఫికేషన్



సదరం రీ వెరిఫికేషన్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యులు

తెనాలి రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో వారంలో మూడు రోజులు నిర్వహించే సదరం రీ వెరిఫికేషన్ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. తొలి రోజు దాదాపుగా 100మంది వరకూ వివిధ విభాగాల వైద్యులు పరీక్షలు నిర్వహించి వైకల్యశాతాన్ని నమోదు చేశారు. వైద్యశాల సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు టై అండ్ డైలో శిక్షణ



శిక్షణ పొందుతున్న మహిళలు

తెనాలి అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జేఎంజే మహిళ కళాశాల ఆధ్వర్యంలో మహిళలకు టై అండ్ డైలో శిక్షణ అందించారు. గృహ విజ్ఞాన శాస్త్ర విభాగం పర్యవేక్షణలో బుధవారం డ్వాక్రా గ్రూపుల మహిళలకు రూరల్ మండలం సంగం జాగర్లమూడిలోని ప్రాథమిక పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. మహిళలంతా శిక్షణను సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆర్థిక ప్రగతికి తోడ్పడాలని సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి చెప్పారు.

బాధితులకు సాయం అభినందనీయం

● తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో ఇళ్లు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలిన బాధితులకు దాతలు చేయూత అందించడం అభినందనీయమని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. రెండు రోజుల క్రితం జగ్గడిగుంటపాలెంకు చెందిన గండికోట ఏసుబాబు, ఆదిలక్ష్మి నివాసముండే పూరిళ్లు ప్రమాదవశాస్తూ దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తక్షణసాయం కింద అదేరోజు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10,000 ఆర్థిసాయం అందించారు. ఆ కుటుంబాన్ని బుధవారం తహసీల్దార్ గోపాలకృష్ణ, మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవా సమితి నిర్వాహకులు మొవ్వా సత్యనారాయణ పరామర్శించి రూ.5000, రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి శాఖ సభ్యులు నిత్యావసరాలు, వంట సామగ్రిని అందించారు. బాధితులకు అండగా నిలిచిన సత్యనారాయణను తహసీల్దార్ గోపాలకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

బాధితులకు ఆర్థికసాయం అందిస్తున్న మొవ్వా సత్యనారాయణ, తహసీల్దార్ గోపాలకృష్ణ

